సోమవారం
30-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 129
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

చంద్రబాబు బెయిల్‌పై నేడు విచారణ

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్, మధ్యంతర బెయిల్ పిటిషన్లపై సోమవారం హైకోర్టు విచారణ జరపనుంది. చంద్రబాబు అనారోగ్యంగా ఉన్నారని... ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని, జైల్లో భద్రత కరువైందని పేర్కొంటూ చంద్రబాబు తరపు న్యాయవాదులు బెయిల్ కోరుతూ హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఇప్పటికే స్కిల్ కేసులో చంద్రబాబు అరెస్టయి... రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో 50 రోజులుగా రిమాండ్‌లో ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లలో ఆందోళన

- కుటుంబీకుల కలవరం
- కావలి సంఘటన ప్రభావం
- విధుల్లోకి వెళ్లేందుకు బెంబేలు
- మొక్కుబడి అరెస్టులకే పరిమితం!
- శాశ్వత పరిష్కారానికి చర్యలేవి?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) లో పని చేస్తున్న డ్రైవర్ల భద్రతా సమస్య ప్రశ్నార్థకంగా మారింది. నిత్యం ప్రజల మధ్య విధుల్లో నిలిచే డ్రైవర్లకు, కండక్టర్లకు రక్షణ కరవైంది. ఎప్పుడు ఏం జరుగుతుందో?, ఎలా ఉంటుందో? తెలియక వారంతా ఆందోళన మధ్య విధులు నిర్వహించాల్సిన పరిస్థితి దాపురించింది. తాజాగా నెల్లూరు జిల్లాలోని కావలి దగ్గర ఆర్టీసీ బస్సు డ్రైవర్లపై కొందరు వ్యక్తులు దాడి చేసిన సంఘటనతో సహచర ఉద్యోగులు కలవరపాటుకు గురవుతున్నారు. ఆర్టీసీ డ్రైవర్ బీఆర్ సింగ్ (బొందిలి రామ్ సింగ్) తో పాటు మరో డ్రైవర్ శ్రీనివాసరావుపై జరిగిన దుండగుల దాడి సహచర ఉద్యోగులనూ బెంబేలెత్తిస్తోంది. డ్రైవర్లు, కండక్టర్లు సైతం విధుల్లో పాల్గొనేందుకు వారి ఆత్మస్థైర్యం దెబ్బతింటోంది. వారంతా బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఎదురవుతోంది. కృష్ణాజిల్లా పెనమలూరు మండలానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ బీఆర్ సింగ్‌ను కొంతమంది వ్యక్తులు దారుణంగా దాడి చేసిన సంఘటన రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితికి అద్దంపడుతోంది. విధి నిర్వహణలో భాగంగా రోడ్డుపై ఉండటంతో హారన్ మోగించిన డ్రైవర్ బీఆర్ సింగ్‌ను వెంటాడి మరీ ఆ ప్రాంత వ్యక్తులు బస్సులో నుంచి లాగి కింద పడేసి కొట్టిన తీరుతో సామాన్య ప్రజలు సైతం భయపడుతున్నారు. ఒక్క ఆర్టీసీ సిబ్బందే కాకుండా, మిగిలిన

- మిగతా 2 లో

నల్ల బ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల ధర్నాలు

- డ్రైవర్లపై దాడిని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన వెల్లువ
- 14 మందిపై నాన్ బెయిల్‌బుల్ సెక్షన్లు పెట్టాలి
- అసలు దుండగులను పోలీసులు తప్పిస్తే ఉద్యమం
- చలో కావలికి పిలుపునిస్తాం
- ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ నేతలు దామోదర్ రావు, నరసయ్య
- కఠిన చర్యలకు ఆదేశిస్తాం : మంత్రి బొత్స, సజ్జల హామీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఈనెల 26న కావలిలో ఆటోనగర్ ఏపీఎస్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ బీఆర్ సింగ్‌తో పాటు మరో డ్రైవర్ శ్రీనివాసరావుపై దాడి చేసిన దుండగులపై నాన్ బెయిల్ బెయిల్‌బుల్ సెక్షన్లతో కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం

- మిగతా 2 లో

ఆర్టీసీ డ్రైవర్లపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

2లో

ఘోర రైలు ప్రమాదం

ఆరుగురు మృత్యువాత
అనేక మందికి తీవ్ర గాయాలు

- విజయనగరం సమీపంలో ఢీకొన్న రెండు రైళ్లు
- ఆగి ఉన్న విశాఖ-రాయగడ ప్యాసింజర్‌ను ఢీకొన్న పలాస ఎక్స్‌ప్రెస్... పట్టాలు తప్పిన బోగీలు
- ప్రమాద ఘటనపై సీఎం దిగ్భ్రాంతి
- సహాయక చర్యలపై అధికారులకు ఆదేశం

విశాలాంధ్ర-విజయనగరం/అమరావతి : విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రైలు ప్రమాదం సంభవించింది. రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతి చెందగా, అనేక మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో విజయనగరం ఆస్పత్రికి తరలించారు. రైల్వే అధికారులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం... రాత్రి 7.10 గంటల సమయంలో విశాఖ-రాయగడ రైలు కొత్తవలస మండలం అలమండ-కంటకాపల్లి వద్ద సిగ్నల్ కోసం పట్టాలపై ఆగి ఉంది. అదే సమయంలో దాని వెనకాలే వస్తున్న పలాస-విశాఖ ఎక్స్‌ప్రెస్ ప్యాసింజర్ రైలును ఢీకొట్టింది. ప్రమాదంపై రైల్వే బోర్డు గ్రూపులో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ సమాచారం ఇచ్చారు. ఎన్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో రాయగడ ప్యాసింజర్ రైలు చివరి నాలుగు బోగీలు పట్టాలు తప్పాయి. పట్టాలు తప్పి పక్కనే ఉన్న గూడ్స్ రైలు పైకి బోగీలు దూసుకెళ్లాయి. దీంతో ఆయిల్ ట్యాంకర్ బోగీలు దెబ్బతిన్నాయి. రైళ్లు ఢీకొనడంతో ఘటనా

- మిగతా 2 లో

పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు భర్తీచేశారు?

- మోదీని నిలదీసిన సీపీఐ నేత సంతోశ్ కుమార్
- ఎన్డీయే, బీఆర్ఎస్, వైసీపీ ప్రభుత్వాలను సాగనంపాలి

విశాలాంధ్ర-హైదరాబాద్: ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న మోదీ పదేళ్ల పాలనలో ఎన్ని ఉద్యోగాలను భర్తీ చేశారో చెప్పాలని సీపీఐ పార్లమెంట్ సభ్యులు పి. సంతోశ్ కుమార్ నిలదీశారు. యువజన, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బీజేపీ, ఆ పార్టీ బీ-టీమ్‌గా వ్యవహరిస్తున్న తెలంగాణ రాష్ట్రంలోని బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లోని వైసీపీ ప్రభుత్వాలను గద్దె దించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉన్నదని నొక్కిచెప్పారు. రెండు రోజుల పాటు జరిగే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలు హైదరాబాద్, హిమాయత్ నగర్, తేరాపంత్ హాల్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ మహాసభ ప్రారంభ సమావేశానికి సంతోశ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ, ఆ పార్టీకి బిటీమ్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించితేనే దేశ, యువతకు భవిష్యత్తు ఉంటుందన్నారు. మోదీకి ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై గౌరవం, విశ్వాసం లేదని దుయ్యబట్టారు. మణిపూర్‌లో మత ఘర్షణలు కొనసాగుతున్నాయని, ఎంతో మంది ఆస్తులను నష్టపోయారని, ప్రాణాలను కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ -హమాస్ యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయిల్‌కి మద్దతు పలికిన ప్రధాని మోదీకి, సొంత దేశంలోని మణిపూర్ ఘటనపై మాట్లాడే తీరిక, స్పందించే సమయం లేదని ఎద్దేవా చేశారు. రెండు నుంచి మూడు గంటల పాటు ప్రసంగించే ప్రధాని మోదీ నిరుద్యోగ సమస్యలు, వారికి ఇచ్చిన హామీ మేరకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాల భర్తీపై నోరువిప్పరని విమర్శించారు. దేశంలో నిరుద్యోగ సమస్య మరింత పెరుగుతోందని, యువత ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం మొదలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర తొలి, మలి దశ ఉద్యమంలో యువత ముఖ్యపాత్ర ఉన్నదని, ఇందులో యువజన సమాఖ్య ముఖ్యభూమిక పోషించిందని గుర్తు చేశారు. ఆ ఉద్యమ స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని , దేశ, రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరుబాట పట్టాలని సంతోశ్ కుమార్ పిలుపునిచ్చారు. సభాధ్యక్షత వహించిన ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువజన వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. నిరుద్యోగ భృతి, జాబ్ కేలండర్ అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యం

- మిగతా 2 లో

కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి అన్యాయం చేస్తే సహించం

- నవంబరు 1న విజయవాడలో కృష్ణాజలాల పున: పంపిణీపై రౌండ్‌టేబుల్ సమావేశం
- 2 నుంచి 18వ తేదీ వరకు కరువు జిల్లాలలో సీపీఐ, రైతు నాయకుల పర్యటన
- 10న సంక్షేమ పెన్షన్లపై విజయవాడలో సదస్సు
- వైసీపీ చేయాల్సింది సామాజిక సాధికార యాత్ర కాదు... కరువు పీడిత యాత్ర
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): కృష్ణా జలాల పున: పంపిణీ పేరుతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేయాలని చూస్తే సహించబోమని, ఏపీకి పదేపదే కేంద్రం చేస్తున్న ద్రోహంపై ఇప్పటికైనా జగన్‌మోహన్ రెడ్డి స్పందించి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. స్థానిక దాసరి భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ గురు, శుక్ర వారాల్లో రెండురోజుల పాటు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశంలో ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొన్నారని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కరువు పరిస్థితులపై అనేక తీర్మానాలను ఆమోదించినట్లు తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేస్తున్నదన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన చట్టం, హామీలు అమలు చేయకుండా ఇప్పుడు మరోమారు ఏపీని దెబ్బకొట్టేందుకు కృష్ణానదీ జలాల పున: పంపిణీ కోసం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. కర్నాటకలో జరిగిన ఎన్నికల సందర్భంగా బీజేపీ అధికారంలోకి రావాలనే దురుద్దేశంతో ఎగువ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తూ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5,600 కోట్లు కేటాయించిందని, అయినా కర్నాటకలో బీజేపీకి భంగపాటు తప్పలేదన్నారు. ఇప్పుడు రానున్న తెలంగాణ ఎన్నికలలో లబ్ధి పొందాలనే దుష్ట తలంపుతో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఎన్నికలొచ్చేలోగా నువు బస్‌డ్రైవర్లను తన్నడం, జనాన్ని చితకబాదడం చేస్తేనే నీకు మంచి రేటు!

ఆశ్రిత పెట్టుబడి ప్రజాస్వామ్యానికి ముప్పు

- ప్రశ్నించే జర్నలిస్టులకు మోదీ సర్కార్ వేధింపులు
- సి రాఘవాచారి స్మారకోపన్యాసంలో సీనియర్ పాత్రికేయులు పరంజయ గుహ థాకుర్తా



విశాలాంధ్ర-విజయవాడ: దేశంలో చట్టాలకు విరుద్ధంగా మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారి విధానంతో ప్రజాస్వామ్యానికి ముప్పువాటిల్లుతుందని సీనియర్ పాత్రికేయులు, బహుముఖ ప్రజ్ఞాశాలి పరంజయ గుహ థాకుర్తా అన్నారు. సంపాదక దిగ్గజం చక్రవర్తుల రాఘవాచారి 4వ వర్ధంతిని పురస్కరించుకుని సీ రాఘవాచారి ట్రస్ట్ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం' (క్రోనీ కాపిటలిజం) అనే అంశంపై థాకుర్తా స్మారకోపన్యాసం చేశారు. స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా థాకుర్తా మాట్లాడుతూ పెట్టుబడిదారి విధానంలో ఆస్తి వ్యక్తిగతంగా ఉండటంతో పాటు పెట్టుబడిదారుల మధ్య పోటీ ఉండటమనే లక్ష్యంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పెట్టుబడిలో పోటీ ఉండదన్నారు. స్కాట్‌ల్యాండ్, వియత్నం, క్యూబా వంటి దేశాలలో మౌలిక వసతులను ప్రభుత్వమే నిర్వహిస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు జనరల్ మోటార్స్‌లో కేవలం 10శాతమే యాజమాన్యం పెట్టుబడి, మిగతా 90శాతం ఇతరుల పెట్టుబడి ఉండేదన్నారు. అందులోనూ ప్రభుత్వరంగ రుణాలే అధికం. దేశ మొదటి ప్రధాని నెహ్రూ భారతదేశం మిశ్రమ ఆర్థిక విధానం అనుసరించినట్లు

- మిగతా 2 లో

కేరళలో ఉగ్రదాడి?

- క్రైస్తవ సభలో ఐఈడీ పేలుళ్లు
- ఒకరి మృతి -45 మందికి గాయాలు
- రాష్ట్రంలో హై అలర్ట్ -రంగంలోకి ఎన్ఐఏ, ఏటీఎఫ్

తిరువనంతపురం/కొచ్చి: వరుస పేలుళ్లతో కేరళ ఉలిక్కిపడింది. ఆదివారం ఓ కన్వెన్షన్ సెంటర్‌లో క్రైస్తవ ప్రార్థనలు జరుగుతున్న సమయంలో పేలుళ్లు జరిగాయి. ఓ మహిళ చనిపోగా 45 మందికి గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పేలుళ్లకు ఆధునిక పేలుడు పరికరం (ఐఈడీ) వాడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు చెప్పారు. దీంతో రాష్ట్రంపై ఉగ్రదాడి

జరిగిందన్న అనుమానాలు వ్యక్తమమయ్యాయి. దీనిని నిర్ధారించలేమని, అన్ని కోణాల్లో విచారణ జరిపిస్తున్నట్లు రాష్ట్ర డీజీపీ షేక్ దార్వేశ్ సాహెబ్ తెలిపారు. రాష్ట్రం హై అలర్ట్‌లో ఉందన్నారు. రాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎఫ్), ఎన్ఐఏ రంగంలోకి దిగినట్లు తెలిపారు. ఇది ఉగ్రదాడి అవునో కాదో పూర్తి విచారణ తర్వాతే చెప్పగలమని డీజీపీ అన్నారు. సంయమనం పాటించాలని, సామాజిక మాధ్యమాల ద్వారా విద్వేషపూరిత సందేశాలతో రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయొద్దని రాష్ట్ర ప్రజలకు సూచించారు. ఆదేశాలు బేఖాతరు

- మిగతా 2 లో

ఇది సరైన సమయం కాదు

అధ్యక్ష రేసు నుంచి తప్పుకుంటున్నా: మైక్ పెన్స్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష రేసు నుంచి తప్పుకున్నట్లు ఆ దేశ మాజీ ఉపాధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత మైక్ పెన్స్ ప్రకటించారు. తాను పోటీ చేసేందుకు ఇది సరైన సమయం కాదని అన్నారు. అందుకోసమే తన ప్రచార కార్యక్రమాలు అన్నింటిని నిలిపివేసినట్లు వెల్లడించారు. ఊహించని ఈ పరిణామం అందరినీ ఆశ్చర్యపర్చవచ్చన్నారు. లాస్ వెగస్‌లో జరిగిన 'రిపబ్లికన్ జెవిష్ కొయిలేషన్' వార్షిక సదస్సులో పెన్స్ ఈ మేరకు ప్రకటన చేశారు. అయితే రిపబ్లికన్ పార్టీ తరపు అభ్యర్థులకు మద్దతిస్తానని, వారి విజయానికి కృషిచేస్తానని చెప్పారు. ప్రచారం ఆపేసినంత మాత్రాన కన్జర్వేటివ్ విలువల కోసం పోరాటాన్ని ఆపబోనని తన మద్దతుదారులనుద్దేశించి రాసిన లేఖలో పెన్స్ పేర్కొన్నారు.

2021లో జరిగిన క్యాపిటల్ అల్లర్ల తర్వాత డొనాల్డ్ ట్రంప్‌తో సంబంధాలు చెడిపోయిన క్రమంలో అనేక మంది రిపబ్లికన్ల మద్దతును పెన్స్ కోల్పోయారు. దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష ఎన్నికలకు ప్రధాన అభ్యర్థిగా ఉన్నారు. ట్రంప్ హయాంలో పెన్స్ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. అంతకుముందు ఇండియానా గవర్నర్‌గా, యూఎస్ కాంగ్రెస్‌సభ్యుడిగా పని చేశారు. ఎనిమిదేళ్ల రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ పెన్స్‌కు సరైన మద్దతు లభించనందునే అధ్యక్ష రేసు నుంచి వైదొలిగారని, నవంబరు 8న మియామిలో జరగబోయే అభ్యర్థుల సమావేశానికి కూడా ఆహ్వానం లభించకపోవడాన్ని అవమానంగా భావించి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది.

పలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ ఆపేయాలి

యూరప్, అమెరికా, పశ్చిమాసియా, ఆసియా దేశాల్లో భారీ ర్యాలీలు

లండన్: పలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణను తక్షణమే ఆపేయాలని, పౌరుల హత్యలు, దమనకాండకు ముగింపు పలకాలని అంతర్జాతీయ సమాజం ముక్తకంఠంతో డిమాండ్ చేస్తోంది. గాజాపై ఇజ్రాయిల్ దళాలు తీవ్రస్థాయిలో దాడులు జరుపుతున్నాయి. ఇప్పటికే పలస్తీనాలో మృతుల సంఖ్య ఎనిమిది వేలకు చేరువైంది. అమాయక ప్రజలు, ముక్కుపచ్చలారని పిల్లలు ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోవడం ప్రపంచాన్ని కలచివేస్తోంది. దీంతో పలస్తీనాకు యావత్ ప్రపంచం అండగా నిలుస్తోంది. తాజాగా యూరప్, పశ్చిమాసియా, అమెరికా, ఆసియా దేశాల్లో పలస్తీనాకు సంఘీభావ ర్యాలీలు భారీస్థాయిలో జరిగాయి. అంతర్జాతీయ స్థాయిలో ఇజ్రాయిల్ ఉత్పత్తులను బాయ్‌కాట్ చేయాలని ప్రదర్శనకారులు పిలుపునిచ్చారు. పలస్తీనా పిల్లల హత్యలకు వనరులు సమకూర్చవద్దని నినదాలు చేశారు. మలేసియా, కౌలాలంపూర్, బాగ్దాద్, ఇస్తాంబుల్, రోమ్, స్విట్జర్లాండ్, డెట్రాయిట్, మిచిగన్, శాన్‌ఫ్రాన్సిస్కో కాలిఫోర్నియా (అమెరికా), టొరొంటో (కెనడా) నార్వే, బెర్లిన్, డోర్ట్‌ముండ్ (జర్మనీ) తదితర నగరాల్లో భారీస్థాయిలో ఆందోళనలు జరిగాయి. మలేసియా ర్యాలీలో బ్యానర్లు, ప్లకార్డులతో వేలాది మంది కదం తొక్కారు. పలస్తీనాకు మద్దతుగా నినాదాలు చేశారు. కౌలాలంపూర్‌లోని అమెరికా దౌత్య కార్యాలయాన్ని ముట్టడించారు. కాల్పుల విరమణకు చర్యలు తీసుకోవాలని రిషి సునాక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ లండన్‌లో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. పలస్తీనా హక్కులు, మానవహక్కుల పరిరక్షణకు ప్రదర్శనకారులు పిలుపునిచ్చారు. హమాస్ కాదు పలస్తీనా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్న నినాదాలు మారుమ్రోగాయిరు. టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో జరిగిన ర్యాలీలో వేలాది మంది పాల్గొన్నారు. ర్యాలీని ఉద్దేశించి అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్ ప్రసంగిస్తూ ఇజ్రాయిల్‌ను దురాక్రమణదారు దేశంగా వర్ణించారు. హమాస్ ఉగ్రవాద సంస్థ కాదన్నారు. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో, వెస్ట్‌బ్యాంక్‌లో, హెబ్రోన్‌తో పాటు యూరప్‌లోని కోపెన్‌హాగన్, రోమ్, స్టాక్‌హోమ్, ఫ్రాన్స్‌లోని ప్రధాన నగరాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు జరిగాయి. పారిస్‌లో ప్రదర్శనలపై నిషేధం విధించినప్పటికీ కొందరు రోడ్లపైకొచ్చి నిరసన తెలిపారు. దక్షిణాది నగరమైన మార్సెల్లీలో వేలాది మందితో మార్చ్ నిర్వహించారు.

ఆర్టీసీ డ్రైవర్లపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

విశాలాంధ్రబ్యూరో–నెల్లూరు: ఆర్టీసీ డ్రైవర్లపై దాడిచేసిన నిందితులను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఈ ఘటనపై ఆర్టీసీ ఉద్యోగులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఉద్యమించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేసి నిందితుల్ని పట్టుబట్టారు. నెల్లూరు ఎపీఎస్ ఆర్టీసీ డ్రైవర్లపై దాడి కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు నిందితులను మీడియా ముందు ప్రవేశ పెట్టారు. ఆదివారం నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ... ఈ కేసులో ప్రధాన నిందితుడు దేవరకొండ సుధీర్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నేరం జరిగిన వెంటనే నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని... నిందితులంతా నకిలీ నోట్ల మార్పిడి ముఠాకు చెందిన వారని తెలిసిందన్నారు. ప్రజలను బెదిరించడం, మోసం చేయడం ఈ ముఠా పనిగా పెట్టుకున్నట్లు తెలిపారు. మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆయన వివరించారు. ముఠాపై గతంలోనే వివిధ కేసులు నమోదయ్యాయని ఎస్పీ వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా సహించేది లేదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. అరెస్టు అయిన ముద్దాయిలను తోటపల్లి గూడురు మండలం వెంకన్నపాలేనికి చెందిన బండి విల్సన్, కావలి మండలానికి చెందిన పుట్టా శివకుమార్ రెడ్డి అలియాస్ మహేంద్ర రెడ్డి, ఏఎస్ పేట మండలం గుడిపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాజావలి, కావలికి కుప్పాల వంశీ, నెల్లూరుకు చెందిన షేక్ కలీం, ఇందుకూరు పేట మండలం నారాయణరెడ్డి పేటకు చెందిన షేక్ ఇలియాజర్, కావలికి చెందిన షేక్ బాజీగా గుర్తించారు.

నల్ల బ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల ధర్నాలు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా ఏపీ పీటీడీ (ఆర్టీసీ–ఈయూ) ఎంప్లాయిస్ యూనియన్ అధ్వర్యంలో తలపెట్టిన నిరసనలు, ధర్నాలు విజయవంతమయ్యాయి. 129 డిపోలలో ఆర్టీసీ ఉద్యోగులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం డిపో గేట్ల ఎదుట నిరసనలు, ధర్నాలు నిర్వహించారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట జరిగిన ధర్నాకు ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర్ రావు, కడప జిల్లా కేంద్రంలో జరిగిన నిరసనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య నాయకత్వం వహించారు. ఈ ధర్నాలకు ఏపీజే అమరావతి సంపూర్ణ మద్దతు తెలిపింది. దామోదర్ రావు, నరసయ్య మాట్లాడుతూ డ్రైవర్లపై దాడిని ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన నల్ల బ్యాడ్జీలతో నిరసనలు–ధర్నాలు విజయవంతం అయ్యాయని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లపై దాడి చేసిన 14 మందిపై నాన్ బెయిల్‌బుల్ సెక్షన్లు పెట్టాలని, వారిని రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కేసును విజయవాడకు బదిలీ చేయాలన్నారు. ఈ సంఘటనపై ప్రభుత్వం స్పందించి అరెస్టులకు ఆదేశాలు ఇవ్వడం సంతోషమేనని, అయితే అసలు దుండగులను పోలీసులు తప్పించే ప్రయత్నాలు చేస్తే ఉద్యమిస్తామని, చలో కావలికి పిలుపునిస్తామన్నారు. అవసరమైతే సమ్మెకు సైతం వెనుకాడబోమని ప్రకటించారు. అటు డ్రైవర్లపై దాడి చేసిన దుండగులపై చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను పలిశెట్టి దామోదర్ రావుతో పాటు ఏపీజే అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కలిసి సమస్యను వివరించారు. అక్కడి నుంచి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో ఫోన్‌లో బొప్పరాజు, పలిశెట్టి మాట్లాడగా, దుండగులు ఎంతటి వారైనా వారిపై చర్యలు తీసుకునేలా తాము ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డితోను నేతలు ఫోన్‌లో మాట్లాడారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు జరగకుండా, దుండగులపై గట్టి చర్యలు తీసుకుని ఉద్యోగుల్లో ధైర్యాన్ని నింపాలని కోరారు. దీంతో డ్రైవర్లపై దాడికి దిగిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారికి చెప్పారు.

పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు భర్తీచేశారు?

(మొదటిపేజీ తరువాయి)

చెందిందని దుయ్యబట్టారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర స్వాగతం పలుకగా, ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. తిరుమలై, ప్రముఖ సామాజిక కార్యకర్త, మహసభల ఆహ్వాన సంఘం చైర్మన్ మోటూరి కృష్ణ ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఇ.టి నర్సింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయా దేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి. స్టాలిన్, ప్రజా నాట్య మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస్, పల్లె నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

భారీ ప్రదర్శన

ఏఐవైఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభల సందర్భంగా హైదరాబాద్ లో ఆదివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. వైఎంసీఏ నుంచి హిమాయత్ నగర్ మహాసభలు జరిగే సభా ప్రాంగణం తెరపంత్ భవన్ వరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎర్ర టీషర్టులను ధరించి, చేతిలో ఏఐవైఎఫ్ జెండాలను చేతబూని వైఎంసీఏ నుంచి ప్రదర్శనగా బయల్దేరారు. ముందు వరుసలో ప్రజా నాట్య మండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ బృందం డప్పు సప్పుళ్లు, ఆలపించిన గేయాలు ప్రత్యేక ఆకర్షణగానిలిచాయి. పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ యువత ప్రదన్శలో పాల్గొన్నది. ఈ ప్రదర్శన నారాయణగూడ, హిమాయత్ నగర్ మీదుగా సభా స్థలి వరకు సాగింది. ఈ ప్రదర్శనలో పై నాయకులంతా పాల్గొన్నారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
Andhra Pradesh State Beverages Corporation Limited
VIJAYAWADA

RFP No.: APSBCL/35/Scrap/2023 dated 26.10.2023

E-Procurement Tender Notice

Sealed Bids under two packet tender system are invited from the Managing Director/Andhra Pradesh State Beverages Corporation Limited (APSBCL) Vijayawada-AP from interested parties/agencies for collection transportation of carton boxes containing liquor & beer bottles from its 15 whole sale depots to its retail outlets initially for a period of one year. The scope of work includes loading of carton boxes from whole sale depots in to transport vehicles and unloading/stacking the same at the respective retail outlets. Interested bidders can download the bids online from ***https://tender.apeprocurement.gov.in*** (ap e procurement portal) and upload the same in the e procurement portal.
For further details please visit our website: ***www.apsbcl.gov.in.***

Managing Director
Andhra Pradesh State Beverages Corporation Limited

ఘోర రైలు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

స్థలంలో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో ఆ ప్రాంతమంతా అంధకారం నెలకొనడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఘటనా స్థలిలో భీతావహ పరిస్థితి నెలకొంది. ప్రమాద సమాచారం తెలిసినా వెంటనే బాధితులను ఆస్పత్రులకు తరలించేందుకు 14 అంబులెన్స్‌లు వెళ్లాయి. మంత్రి బొత్స సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

సీఎం జగన్ దిగ్భ్రాంతి

విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాద దుర్ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖ నుంచి రాయగడ వెళ్తున్న ప్యాసింజర్ రైలుకు ప్రమాదం జరిగినట్టుగా ప్రాథమిక సమాచారం వచ్చిందని, ఈ ఘటనలో నాలుగు బోగీలు పట్టాలు

తప్పినట్టుగా సమాచారం అందుతోందని సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. విజయనగరం సమీప జిల్లాలైన విశాఖపట్నం, అనకాపల్లి నుంచి వీలైనన్ని అంబులెన్స్‌లను పంపించాలని, మంచి వైద్య అందించడానికి సమీప ఆస్పత్రుల్లో అన్నిరకాల ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. వైద్య ఆరోగ్య, పోలీసు, రెవెన్యూ సహా ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులకు సత్వర వైద్య సేవలు అందేలా చూడాలని సీఎం ఆదేశాలు జారీచేశారు. ఘటన సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రెండు ప్రయాణికుల రైళ్లు ఢీకొన్న ఘటనలో బాధితుల సహాయం కోసం, సమాచారం అందించడం కోసం విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బాధితుల సహాయ సమాచారం కోసం కలెక్టర్ కార్యాలయంలో 9493589157 తో ఫోన్ నంబర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాధితుల సహాయ సమాచారం కోసం ఏర్పాటు చేసిన రైల్వే ఫోన్ నంబర్ 8978080006 కు కాల్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్లలో ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగులు, కుటుంబ సభ్యులలోనూ ఆందోళన నెలకొంది.

డ్రైవర్లకు భద్రత ఏదీ?

కావలి సంఘటన అనంతరం ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు విధులు నిర్వహణలో భద్రత అంశం మరోసారి తెరపైకి వస్తోంది. నాటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ నుంచి విభజిత ఆంధ్ర ప్రదేశ్ వరకు ఆర్టీసీలో పని చేస్తున్న డ్రైవర్ల పైన, కండక్టర్ల పైన అనేక దాడులు, అవమానాలు, బరితెగింపు చర్యలకు పాల్పడిన సంఘటనలున్నాయి. మదనపల్లిలో నెలల క్రితం ముగ్గురు ఆకతాయిలు ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేశారు. గత ఏడాది విజయవాడలో డ్రైవర్‌పై మహిళ ఘోరంగా దాడి చేసింది. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం చొరవ తీసుకుని దుండగులను కఠినంగా శిక్షించి, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఉంది. వాటిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి యూనియన్లు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. దీంతో ఇలాంటి సంఘటనలు ఉత్పన్నమవుతున్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశామంటూ ఆర్భాటంగా సీఎం జగన్ ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోంది. వారికి రావాల్సిన ఉద్యోగపరమైన ప్రయోజనాలను ఇంతవరకు చేకూర్చలేదు. సాధారణ ఉద్యోగుల ప్రయోజనాల తరహాగా, ఆర్టీసీ సిబ్బందికి కల్పించడంలో ఈ ప్రభుత్వం వెనుకబాటుకు గురైంది. ఎంతసేపు ఉద్యోగులను ఆర్టీసీలో విలీనం చేశామనే మాట మినహా, వారి భద్రత పైన, వారి సంక్షేమం పైన ఈ ప్రభుత్వం దృష్టి పెట్టలేదనే విమర్శలున్నాయి. విధి నిర్వహణలో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లపై దాడులను నియంత్రించేందుకు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక చట్టం తేవాల్సి ఉంది.

ప్రభుత్వ తీరుపై విపక్షాల ఆగ్రహం

కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వ స్పందించిన తీరు సరిగ్గా లేదని విపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. ఆర్టీసీ డ్రైవర్లపై దాడిని నిరసిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు ఏపీపీటీడీ ఆర్టీసీ యూనియన్ పిలుపునిచ్చింది. పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణకు సన్నద్ధమైంది. దీంతో పోలీసు శాఖ ఆలస్యంగా స్పందించి కొంతమందిని అరెస్ట్ చేసినట్లు హడావిడిగా ప్రకటించింది. మిగిలిన వారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వర్ తెలిపారు. డ్రైవర్లను చితకబాదిన సంఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. లేకుంటే సాధారణ సంఘటనగానే భావించి మౌనంగా ఉండిపోయేదని ఆర్టీసీ ఉద్యోగులు మండిపడుతున్నారు. అయితే, ప్రభుత్వం, పోలీసు శాఖ మొక్కుబడి చర్యలకే పరిమితమైంది.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కావలి తరహా సంఘటన భవిష్యత్తులో జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు మానసిక స్థైర్యం నింపేలా ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉంది.

కేరళలో ఉగ్రదాడి?

(మొదటిపేజీ తరువాయి)

చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని తేల్చిచెప్పారు. ఆయన తిరువనంతపురంలో విలేకరులతో ఉదయం 9.40 గంటలప్పుడు కలామస్సేరీలోని జమ్రా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఐఈడీ పేలుడు ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరో 45 మంది గాయపడ్డారని చెప్పారు. ఈ ఘటనపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అయితే మొత్తం మూడు పేలుళ్లు జరిగాయని, ఇందులో రెండు శక్తిమంతమైనవిగా పోలీసు వర్గాలు తెలిపాయి. టిఫిన్ బాక్సుల్లో ఐఈడీలు అమర్చి పేలుళ్లు జరిపినట్లు వచ్చిన వార్తలపై స్పందిస్తూ వివిధ కోణాల్లో దర్యాప్తు జరుగుతున్నట్లు పేర్కొన్నాయి. కాగా కలామస్సేరీ వైద్య కళాశాలలోని కాలిన గాయాల విభాగంలో పేలుళ్ల బాధితులు పది మంది చేరితే, వీరిలో ఇద్దరి శరీరం 50శాతానికిపైగా కాలిపోగా వేరొక ఆసుపత్రికి తరలించినట్లు ఎర్నాకులం జిల్లా కలెక్టర్ ఎన్ఎస్‌కే ఉమేశ్ తెలిపారు. జనరల్ వార్డులో మరో ఎనిమిది మంది, వివిధ ఆసుపత్రుల్లో 18 మంది చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. చనిపోయినది ఓ మహిళ అని, ఆమె ఎవరో తెలియలేదని అన్నారు.

చాలా దురదృష్టకరం: గవర్నర్, సీఎం

వరుస పేలుళ్లు జరగడం చాలా దురదృష్టకరమని కేరళ గవర్నర్ ఆరీఫ్ మహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దిల్లీలో ఉన్న విజయన్ అక్కడ విలేకరులత మాట్లాడుతూ 'ఇది చాలా దురదృష్టకరమైన ఘటన. ఒకరు చనిపోయారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నాం' అని అన్నారు. పలస్తీనా నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు తీవ్ర చర్యలకు ఉపకరిస్తే కఠిన చర్యలు తప్పబోవని సీఎంతో ఉన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ తెలిపారు. పలస్తీనాకు కేరళ అండగా ఉందన్నారు. తాజా ఘటన ఉగ్రచర్యగా తోస్తోందన్నారు. తాజా పరిణామాలపై తప్పుడు కథనాలు/సమాచారం ప్రచారం జరగకుండా మీడియా జాగ్రత్త పడాలని రెవెన్యూ మంత్రి కె.రాజన్ ఆదేశాలిచ్చారు.

కేంద్ర హోంమంత్రి ఆరా

ముఖ్యమంత్రి విజయన్‌తో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడి రాష్ట్రంలోని పరిస్థితుల గురించి ఆరా తీశారు. కేంద్ర దర్యాప్తు బృందాలను విచారణ కోసం పంపినట్లు సీఎంతో చెప్పారు.

నేడు అఖిలపక్షం

పేలుళ్ల ఘటన క్రమంలో అఖిలపక్ష సమావేశాన్ని సీఎం విజయన్ నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు సెక్రటేరియట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అఖిలపక్షం భేటీ కాబోతోందని సీఎంఓ వెల్లడించింది.

భద్రత కట్టుదిట్టం

14 జిల్లాల్లోని రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రధాన కూడళ్లు, చర్చీలు, మెట్రో స్టేషన్లతో జనసందోహ ప్రాంతాలపై నిఘా పెట్టినట్లు పోలీసు అధికారి చెప్పారు. ఉత్తరప్రదేశ్, హరియాణా వైపు నుంచి రాష్ట్రానికి వచ్చే మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. మఫ్టీ పోలీసులు విధుల్లో ఉన్నారని, రైడర్లు, పీసీఆర్‌లను అప్రమత్తం చేశామని, తమకు అందే ఎలాంటి సమాచారాన్ని నిర్లక్ష్యం చేయొద్దని సూచించినట్లు తెలిపారు. మార్కెట్ల వద్ద గస్తీ పెంచామన్నారు. పండుగ సమయం కాబట్టి ఇప్పటికే అదనపు బలగాలను మోహరించామన్నారు. కాగా కేంద్ర సంస్థలతో దిల్లీ పోలీసు శాఖ స్పెషల్ సెల్ సంప్రదింపులు జరుపుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

వ్యక్తి లొంగుబాటు–నేరాంగీకారం

పేలుళ్లకు బాధ్యత వహిస్తూ ఓ వ్యక్తి త్రిస్సూర్ జిల్లాల పోలీసుల ఎదుట కొడకారా పోలీసు స్టేషన్‌లో లొంగిపోయినట్లు ఏడీజీపీ శాంతిభద్రతలు ఎంఆర్ అజిత్ కుమార్ తెలిపారు. 'అతని పేరు డామినిక్ మార్టిన్. నేరాన్ని అంగీకరించడమే కాకుండా దానికి ఆధారాలు చూపాడు. వాటిని పరిశీలిస్తున్నాం. పేలుళ్లకు కారణాలను అన్వేషిస్తున్నాం' అని అన్నారు. నిందితుడు... యహోవా విట్నెస్ క్రైస్తవ సంఘం సభ్యుడన్నారు. ఈ సంఘం 19వ శతాబ్దంలో అమెరికాలో ఏర్పాటైంది. ఇంటెలిజెన్స్ వైఫల్యం కోణంలోనూ ఆరా తీస్తున్నామని, అన్ని శాఖల దళాలు దర్యాప్తు చేపట్టాయని ఏడీజీపీ అన్నారు.

రాష్ట్రానికి అన్యాయం చేస్తే సహించం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రంలోని బీజేపీ కృష్ణానదీ జలాల పున:పంపిణీ అంటూ కుయుక్తులు పన్నుతోందన్నారు. ముఖ్యమంత్రి దిల్లీలో ఉండగానే కృష్ణా జలాల పున: పంపిణీపై గెజిట్ ఇవ్వటం తీవ్రమైన అన్యాయమన్నారు. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల పున: పంపిణీ అంశంపై వివిధ రాజకీయ పక్షాలు, రైతు, ప్రజాసంఘాలు, సాగునీటి రంగ నిపుణులను ఆహ్వానించి నవంబరు 1న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 18 జిల్లాలలో ఎన్నడూ చూడని దారుణమైన తీవ్ర కరువు పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు లక్షలాది ఎకరాల్లో పంటలు వేయలేదన్నారు. వేసిన పంటలకు నీరందక ఎండిపోయాయన్నారు. అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాలలో పంట వేసిన వారికంటే వేయని వారి పరిస్థితే మెరుగుగా ఉందని, కనీసం వారికి పెట్టుబడి అయినా మిగిలిందన్నారు. ఏపీలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీరులేక తీవ్ర దుర్భర స్థితి ఏర్పడిందన్నారు. ఇంత దారుణమైన కరువు పరిస్థితిపై ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం సబబు కాదన్నారు. కర్నాటకలో సెప్టెంబరు 24న కరువు పరిస్థితిపై క్యాబినెట్ సమావేశం పెట్టి, కేంద్ర బృందాలను పర్యటనల కోసం ఆహ్వానించారని గుర్తు చేశారు. కరువు తీవ్రతపై మాట్లాడేందుకు జగన్‌మోహన్ రెడ్డి నామోషీగా ఫీలవుతున్నారన్నారు. నవంబరు 2న సీపీఐ, రైతు సంఘాల నాయకులతో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్రంలోని 18 కరువు జిల్లాలలో పర్యటనలు చేసి దుర్భిక్ష పరిస్థితులను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తెస్తామన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయవద్దని కార్మిక సంఘాలన్నీ చేస్తున్న సుదీర్ఘ ఐక్య పోరాటాలకు నవంబరు 8 నాటికి వెయ్యి రోజులు పూర్తవుతుందన్నారు. దీనికి మద్దతుగా రాష్ట్రంలో ఉన్న విద్యార్థి, యువజన సంఘాలు ఇచ్చిన విద్యా సంస్థల బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నదన్నారు. అన్ని రకాల సంక్షేమ పెన్షన్లను నెలకు రూ.6 వేలకు పెంచి ఇవ్వాలని, వికలాంగులకు రూ.7 వేలు ఇవ్వాలని కోరుతూ నవంబరు 10న విజయవాడలో సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలలో ఈ తీర్మానాన్ని పొందుపరచాలని కోరారు. సీపీఐ అధ్వర్యంలో వామపక్ష పార్టీలతో కలిసి పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా అనేక చోట్ల కార్యక్రమాలు చేపట్టి ప్రజా బ్యాలెట్ నిర్వహించామని, రాబోయే రోజుల్లో విద్యుత్ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పుడు ఏపీలో అధికార వైసీపీ సామాజిక సాధికార యాత్ర కాకుండా కరువు ప్రాంత యాత్ర చేస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అన్ని పథకాలలో కోత విధించి సామాజిక న్యాయం చేస్తామని వైసీపీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ చర్యలను గమనిస్తూనే ఉన్నారన్నారు. రాష్ట్రంలో వైసీపీ శ్రేణుల అరాచకం పెచ్చుమీరిపోతోందని, శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కావలి సమీపంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను విచక్షణా రహితంగా కొట్టి, బెదిరించడమే అందుకు నిదర్శనమన్నారు. బస్సు హారన్‌కే జగన్ సర్కార్ బెంబేలెత్తిపోయే పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు. వైసీపీ అరాచకాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పీడిత ప్రాంతాలలో నాలుగున్నర సంవత్సరాలలో రైతులు తీవ్రంగా నష్టపోయి 4 వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాలపరిమితి లేకుండా ఒక్కో కుటుంబానికి రూ.7 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా వెంటనే ఇస్తామని చెప్పి, కేవలం రూ.47 కోట్లు ఇవ్వటం దారుణం అన్నారు. అవి రైతుల ఆత్మహత్యలు కాదని, ఇతర కారణాలతో చనిపోయారని ప్రభుత్వం కుంటిసాకులు చెబుతూ ఆయా కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వకుండా మాట తప్పటం అత్యంత దారుణమని, ఇది మోసం చేయటమేనన్నారు. గత ఎన్నికలకు ముందు జగన్ పెన్షన్‌లు రూ.3 వేలు ఇస్తానని చెప్పి నాలుగున్నర సంవత్సరాలయ్యిందని, ఈ కాలంలో 300 శాతం నిత్యావసర, వైద్య ఖర్చులు అపరిమితంగా పెరిగాయని అన్నారు. ప్రతి సచివాలయం వద్ద పెన్షన్‌దారులతో అర్జీ పెట్టించి ఉధృత ఆందోళన చేపడతామని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

గుర్తు చేశారు. అయితే దేశంలో ప్రజల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు ఉద్యోగులకు మేలు చేసేవిగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆధీనంలో ఉన్న సంస్థల్ని ప్రజల ఆస్తులను ఎంపిక చేసి సన్నిహితులకే కట్టబెట్టటం ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అవుతుందన్నారు. ప్రస్తుతం స్వేచ్ఛాయుత పెట్టుబడిదారి వ్యవస్థ లేదన్నారు. దేశంలో 40శాతం నౌకాశ్రయాలు గౌతమ్ అదాని చేతిలో ఉన్నాయన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, బొగ్గు గనులతో పాటు నిత్య జీవితంలో అవసరమయ్యే వస్తువులు వంట నూనెలు, గిడ్డంగులు, డేటా స్టోరేజీ, డ్రోన్స్ తయారీ వంటి అనేక విభాగాలు కలిగి దేశంలోని ఐదోవంతు మార్కెట్ అదాని చేతిలో ఉందన్నారు. 25 ఏళ్ల క్రితం అదాని అంటే ఎవరికీ తెలియదని నేడు ప్రపంచ కుబేరుల్లో 3వ స్థానానికి ఎదగటానికి ఆయనకు ఉన్న అనుభవం, నైపుణ్యం కాదని కేవలం మోదీ ప్రభుత్వం ఇచ్చిన అవకాశాలు మాత్రమే కారణం అన్నారు. విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకుని దాన్ని అధిక ధరకు మన ప్రభుత్వానికి అమ్ముతున్నారన్నారు. ఆశ్రిత పెట్టుబడిదారులు ఎదగటానికి రాజకీయ అంశాలు కారణమవుతాయని చెప్పారు. ఎమర్జెన్సీ తరువాత ఇందిరా గాంధీకి ధీరుబాయి అంబానీ అనుకూలంగా వ్యవహరించారని దీంతో అంబానీ ప్రపంచ పెట్టుబడిదారుగా మారారని తెలిపారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ప్రాధాన్యత తగ్గి అదాని రెండవ స్థానంలో ముందుకు వచ్చారని పేర్కొన్నారు. జీవీకే సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌తో దాడులు చేయించి ముంబై విమానాశ్రయాన్ని అదానికి అప్పగించారని, అలాగే ఆదాయపు పన్ను, ఈడీలతో భయపెట్టి ఆంధ్రప్రదేశ్‌లోని గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టులను ఆదానీకి కట్టబెట్టారని వివరించారు.

ప్రసార మాధ్యమాలు లొంగుబాటు:

ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న ప్రసార మాధ్యమాల ప్రతినిధులు, ఉద్యమకారులపై కేసులు పెటుడుతున్నారని చెప్పారు. న్యాయస్థానం ధిక్కారం అనే ఆయుధాన్ని వినియోగిస్తూ నిజాన్ని ప్రజలకు తెలియకుండా చేస్తున్నారని తెలిపారు. మీడియా సంస్థలను కొనటం, లేదా వాటికి ప్రకటనలు ఇవ్వటం ద్వారా ప్రసార మాధ్యమాలు లొంగిపోవటం జరిగిందన్నారు. సోషల్ మీడియా విస్తరించినా వాటిలో అవాస్తవాలు ఎక్కువగా ప్రచారం అవుతున్నాయని చెప్పారు. వాస్తవాల్ని స్వేచ్ఛగా రాసే జర్నలిస్టులు రావాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ కేవలం తనకు అనుకూలంగా ఉన్న మీడియా ప్రతినిధులతోనే మాట్లాడుతారని అందువల్ల ప్రశ్నించటం కాకుండా ప్రశంసించటంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు:

న్యూస్‌క్లిక్ ఛానల్‌పై దాడి చేయటం ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను తలపిస్తున్నదన్నారు. అక్టోబరు 3వ తేదీ తెల్లవారుజామున పోలీసులు దాడి చేసి సంస్థ యజమాని పురకాయస్థను అరెస్టు చేశారని చెప్పారు. తాను ఆ సంస్థకు సలహాదారుగా ఉన్నందుకు తనను కూడా పోలీసులు ప్రశ్నించారన్నారు. ఢిల్లీలో మతఘర్షణలు, కోవిడ్ నియంత్రణ చర్యలుపై రాశారా? అని పోలీసులు ప్రశ్నించారని తెలిపారు. చైనా కమ్యూనిస్టు పార్టీకి అనుకూలంగా పురకాయస్థ ఉన్నారని దాంతో అమెరికాకు చెందిన ఒక మీడియా సంస్థ ద్వారా ఆర్థిక సహాయం అందుతోందని అభియోగంతో పోలీసులు ఆయన్ని అరెస్టు చేశారని తెలిపారు. విదేశీ నిధులు రావటం వల్ల వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపించటం లాంటి అభియోగాలు మోపారాని తెలిపారు. ల్యాప్‌ట్యాప్‌లు, సెల్‌ఫోన్‌లు, హార్డ్‌డిస్క్‌లు వంటి వందకు పైగా ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. పోలీసులు వ్యవహరించిన తీరు, ప్రభుత్వ విధానాలు పరిశీలిస్తే ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు తలిపిస్తున్నాయని వివరించారు. ఈ సందర్భంగా థాకుర్తాను సి.రాఘవాచారి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కె.జ్యోత్స్న తదితరులు సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ముందుగా సి.రాఘవాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. థాకుర్తాను పరిచయం చేస్తూ లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. ఆయన ఆంగ్ల ప్రసంగాన్ని విశ్రాంత ఆచార్యులు అంజిరెడ్డి తెలుగులో అనువాదం చేశారు. తొలుత అభ్యాస స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు దేశమును ప్రేమించుమన్న గేయాన్ని ఆలపించారు. బి.జమిందార్ అతిథులకు స్వాగతం పలికారు. అభ్యాస స్కూల్ నిర్వాహకులు కృష్ణ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు. జర్నలిస్టులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

‘కళ్లు తెరిపిద్దాం’

కళ్లకు గంతలు కట్టుకుని టీడీపీ శ్రేణుల నిరసన

‘నిజం గెలవాలి’ ప్లకార్డుల ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ స్కిల్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత నారా చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ, టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం రాత్రి 7 గంటల నుంచి ఐదు నిముషాలపాటు ‘ కళ్లు తెరిపిద్దాం’ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిలుపులో భాగంగా, రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు, జగన్ పాలనకు వ్యతిరేకంగా కళ్లకు గంతలు కట్టుకుని నిజం గెలవాలవాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఆ దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం ఎదుట ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు దేవినేని ఉమా, నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావు తదితరులు నిరసన తెలిపారు. లోకేశ్-బ్రాహ్మణి కూడా కళ్లకు గంతలు కట్టుకొని, నిజం గెలవాలి అనే ప్లకార్డులను చేతబట్టి, వాటిని సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. విజయవాడ మొగల్రాజుపురం, సిద్ధార్థ సర్కిల్, మదర్ థెరిస్సా బొమ్మ వద్ద చంద్రబాబుకు మద్దతుగా కళ్లకు గంతలు కట్టుకుని, నిజం గెలవాలి అనే ప్లకార్డులతో పార్టీ నేతలు, కార్యకర్తలు నినదించారు. ఈ కార్యక్రమానికి కేశినేని శివనాథ్(చిన్ని) నాయకత్వం వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ పార్టీ నాయకులు కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు.

సాగునీటి వనరులపై పాలకులకు చిత్తశుద్ధి లేకే కరువు

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-పాలకొండ: సాగునీటి వనరులపై పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడమే కరువుకు దారితీస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ వ్యాఖ్యానించారు. నీటి జాడలేక పంట సాగుకు వర్షాలపై ఆధారపడాల్సిన స్థితి ఆంధ్రప్రదేశ్ రైతులకు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో తోటపల్లి జంఝావతి రావాడ రిజర్వాయర్, పెదంకలా వెంగళరావు సాగర్ పెద్దగడ్డ తదితర సాగునీటి రిజర్వాయర్లు ఉన్నప్పటికీ వాటి నిర్వహణకు నిధులు విడుదల చేసి పనులు చేయకపోవడంతో ఆయకట్టు భూముల సాగుదారులు వర్షం కోసం ఎదురు చూడాల్సి వస్తోందని ప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయ రంగం ప్రకృతిపై ఆధారపడే స్థితికి పాలకులు చేర్చారన్నారు. ఆదివారం విజయనగరం జిల్లా పాలకొండలో ఎలైట్ కాలేజీ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమావేశం ఈవీ నాయుడు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ ప్రాజెక్టు పోలవారానికి పరిస్థితి చూస్తే రాష్ట్రంలో ఏ ప్రాజెక్టుకైనా పైసా ఇచ్చి పనులు చేయిస్తారనిపిస్తోందా అని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమం ఒక్కటే మార్గమన్నారు. కార్మికులు, రైతు సంఘాల సంయుక్త అధ్వర్యంలో నవంబరు 28, 29 తేదీల్లో విజయవాడలో తలపెట్టిన భారీ నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని రాష్ట్ర రైతాంగానికి పిలుపునిచ్చారు. జిల్లాలో అన్ని రకాల పంటలు కలిపి రెండున్నర లక్షల ఎకరాలలో సాగు జరుగుతోందని, వరి పంట ఎన్ను దశలో ఉండగా సాగునీరు లేక రైతులు రాత్రింబవళ్లు నిద్రాహారాలు మాని ఇబ్బంది పడుతున్నారని ప్రసాద్ అన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ ఒకవైపు పంటలకు దోమపోటు మరోవైపు నీటి పోటు అని విమర్శించారు. రైతులు విలవిలాడిపోతున్నా స్థానిక నాయకుల్లోగానీ జలవనరుల శాఖ అధికారులలోగానీ చలనం లేదన్నారు. నవంబరు ఒకటి నుంచి జిల్లాలో కరువు పర్యటనలు చేసి క్షేత్రస్థాయి వివరాలు తెలుసుకొని 6వ తేదీన కలెక్టర్ కార్యాలయం పార్వతీపురం వద్ద రైతులతో ధర్నా చేస్తామన్నారు. భామిని మండలంలో ప్రతి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, ధాన్యం సేకరణలో జంబ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే రవాణాకు వాహనాలను సమకూర్చాలని, సంపద రకం ధాన్యాన్ని గోదావరి జిల్లాలకు తరలించే ప్రణాళిక చేపట్టి మిల్లర్ల నుంచి రైతు దోపిడీకి గురి కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశానికి హాజరైన వివిధ మండలాల సభ్యుల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టి తెచ్చి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు గులిబిల్లి అప్పలనాయుడు, వెలమల సత్యనారాయణ (జిల్లా అధ్యక్షులు), లక్ష్మీపతి నాయుడు కొత్తకోట అప్పలనాయుడు (భామిని మండలం), వావిలపల్లి రమణమూర్తి, కిమిడి రామ్మూర్తి నాయుడు వండాన కూర్మా రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్మికులకు వేతనాలు పెంచాలి

- ఫేస్ యాప్ రద్దు చేయాలి
- ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ

విశాలాంధ్ర-నంద్యాల: అంగన్‌వాడీ కార్మికులకు తెలంగాణ కంటే రూ.1,000 అదనంగా ఇస్తానన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మునెప్ప డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని స్వామిరెడ్డి భవన్‌లో అసోసియేషన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం వసుంధరా దేవి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా లలితమ్మ, మునెప్ప, జిల్లా కార్యదర్శి సుంకయ్య, రమేష్ బాబు, బాలకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి లలితమ్మ మాట్లాడుతూ ప్రధానంగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌తో అంగన్‌వాడీలకు ఇబ్బందిగా ఉందని, సిగ్నల్స్ ఉండడం లేదని, ప్రీస్కూల్ సక్రమంగా జరగడం లేదన్నారు. కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, పెన్షన్ ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్ విషయంలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ తదితర డిమాండ్లను తీర్చాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు అబ్బాస్, భాస్కర్, యూనియన్ జిల్లా నాయకులు జులేఖ, చాందిని, చంద్రకళ, తిరుపతమ్మ, ఇందు, పద్మ, సుజాత, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయవాడకు సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం విజయవాడకు రానున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సరేందర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. సాయంత్రం 4.47 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి సీఎం బయలుదేరి రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. అక్కడ ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా కర్నాటక హైకోర్టు నుంచి బదిలీపై వచ్చిన జస్టిస్ జి.నరేందర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం తాడేపల్లి నివాసానికి సీఎం చేరుకుంటారు.

1న వైఎస్ఆర్ అవార్డుల ప్రదానం

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: వైఎస్ఆర్ జీవిత సాఫల్య, వైఎస్ఆర్ సాఫల్య అవార్డుల ప్రదానోత్సవాన్ని నవంబర్ ఒకటో తేదీన విజయవాడలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరు కానున్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరిట వరుసగా మూడో ఏడాది అవార్డు గ్రహీతల జాబితాను విడుదల చేశారు. మొత్తం 27 మందికి వైఎస్ఆర్ అవార్డులను ప్రదానం చేస్తారు. ఇందులో వైఎస్ఆర్ జీవిత సాఫల్య అవార్డులు 23 మందికి, వైఎస్సార్ సాఫల్య అవార్డులు నలుగురికి ఇవ్వనున్నారు.

ప్రజా సమస్యల్ని వదిలేసి రాజకీయ బస్సు యాత్రలా?

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- నేటి నుంచి ప్రజా రక్షణభేరి జాతాలు
- పాటల సీడీ, పోస్టర్ల ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజా సమస్య పరిష్కారమే అజెండాగా తమ పార్టీ సోమవారం నుంచి ప్రజా రక్షణ భేరీ పేరుతో ప్రచార జాతాలను చేపట్టిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు వెల్లడించారు. రాష్ట్రంలో కరువు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, భూ సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే అధికారపార్టీ వైసీపీ ప్రజాసమస్యలను గాలికి వదిలి రాజకీయ ప్రచారం కోసం బస్సు యాత్రలను చేపట్టడం తగదని విమర్శించారు. ఆదివారం విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో ప్రజారక్షణ భేరీ ప్రచార జాతాలకు సంబంధించి పాటల సీడీ, పోస్టర్లతో పాటు రాష్ట్రంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రూపొందించిన తొమ్మిది పుస్తకాలను శ్రీనివాసరావుతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, మంతెన సీతారాం, సీహెచ్ బాబురావు, వీ ఉమా మహేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో మూడు భిన్న ప్రాంతాల నుంచి బయలుదేరే ఈ ప్రచార జాతాలన్నీ విజయవాడకు చేరుకుంటాయని... నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ ప్రచార జాతాలన్నీ అసమానతల్లేని అభివృద్ధి నినాదంగా సాగుతున్నాయన్నారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జులైలోనే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం కరువును అధిగమించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పొరుగున కర్నాటక ప్రభుత్వం కరువును ప్రకటించడంతోపాటు కేంద్ర బృందాలను రప్పించి నివేదికలను తయారు చేసినప్పటికీ, మన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా కరువు మండలాలను ప్రకటించకపోవడం బాధ్యతా రాహిత్యమన్నారు. వర్షాధారిత పంటలే కాదు ప్రాజెక్టుల కింద ఉన్న పంటలు కూడా ఎండిపోయాయని తెలిపారు. బాపట్ల, కృష్ణా, గుంటూరు జిల్లాలో ఆయకట్టు సాగు అంతా ఎండిపోయిందని... కృష్ణానే కాకుండా గోదావరి ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తీవ్రమైన కరువు నేపథ్యంలో రానున్న రోజుల్లో ధరలు పెరగకుండా ప్రజలకు ఆహారభద్రత కల్పించేందుకు రాష్ట్రంలో పండిన ధాన్యాన్ని మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట రుణాలను పూర్తిగా రద్దుచేసి రైతులకు ఉపశమనం కల్పించాలన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమిస్తాం

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు

8న విద్యాసంస్థల బంద్

విశాలాంధ్ర-కాకినాడ: అనేకమంది విద్యార్థులు, యువజనుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం నవంబర్8 నాటికి వెయ్యి రోజులకు చేరుతున్న సందర్భంగా విద్యార్థి యువజన సంఘాలు అదే రోజున (నవంబరు 8) విద్యా సంస్థల బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు తెలిపారు. విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని... కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఏఐవైఎఫ్ కాకినాడ జిల్లా సమితి అధ్వర్యంలో విద్యార్థి యువజన ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై.బాబీ అధ్యక్షతన జరిగింది. ఈ సంధర్భంగా పరుచూరి రాజేంద్ర మాట్లాడుతూ... లాభాల్లో నడుస్తున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచన కేంద్రం విరమించుకోవాలన్నారు. ఫ్యాక్టరీకి అనుబంధంగా ఐరన్ గనులు కేటాయించకపోవడం సిగ్గుచేటని, ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ పోరాడిన అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేస్తామని తెలిపారు. మోదీ ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలు చేయడంలేదని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని... అయినా రాష్ట్రంలోని బీజేపీ నేతలు ప్రధాని మోదీని ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పెద్దలు నిద్ర నటిస్తున్నారని రాష్ట్ర ప్రయోజనాల కంటే ముఖ్యమంత్రి కివ్యక్తిగత ప్రయోజనాలు ఎక్కువయ్యాయన్నారు. కేసుల భయంతో మోదీ ముందు మోకరిల్లుతున్నారని విమర్శించారు. రాష్ట్ర విభజన హామీల్లో ప్రధానమైన కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం కేంద్రం ఒక్క పైసా కూడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటని, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం రెండు సార్లు శంకుస్థాపన చేసినా... ఆచరణలో అమలు కావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకై విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన విద్యార్థి జేఏసీ నాయకులు బులిరాజు, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సిద్దు, పీడీఎస్‌యూ (వి) నాయకులు శ్రీకాంత్, యస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, జనసేన నాయకులు నారాయణ రావు, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి సూరంపూడి రవికుమార్, నాని, వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మేనేజ్‌మెంట్ పునాదులు కదిలాయి

- న్యాయవ్యవస్థను గబ్బుపట్టించిందెవరో ప్రజలకు తెలుసు
- మంత్రులు మేరుగు నాగార్జున, సీదిరి అప్పలరాజు, అంజాద్ బాషా, రాజన్నదొర ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు మేనేజ్ మెంటు పునాదులు కదిలాయని...అందుకే ఆందోళన చెందుతున్నారని రాష్ట్ర మంత్రులు మేరుగు నాగార్జున, సీదిరి అప్పలరాజు, అంజాద్ భాషా, రాజన్న దొర విమర్శించారు. న్యాయవ్యవస్థను గబ్బుపట్టించిందెవరో ప్రజలకు బాగా తెలుసని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మంత్రులు ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు 46ఏళ్ల రాజకీయ జీవితంలో తప్పించుకుని తిరిగాడే తప్ప, అవినీతి చేయకుండా ఏ ఒక్క రోజూ లేదన్నారు. బాబు సామ్రాజ్య పునాదులన్నీ అవినీతి-వెన్నుపోటు-వ్యవస్థల మేనేజ్ మెంటు- అబద్ధం అనే నాలుగు స్తంభాల మీద నిలబడ్డాయని తెలిపారు. ఈ విషయం ఈ తరానికి పెద్దగా తెలియక పోవచ్చు గానీ... 30 40 ఏళ్లుగా చంద్రబాబును గమనించిన రాజకీయ విశ్లేషకులకు ప్రజలకు, మరీ ముఖ్యంగా టీడీపీలో ఆయనతోపాటు కలిసి దోచుకున్న, వాటాలు పంచుకున్న ముఠాలకు బాగా తెలునని ఆరోపించారు. ఈ సారి చంద్రబాబు వ్యవస్థల్ని మేనేజ్ చేయలేకపోయాడనేదే లోకేశ్ తోపాటు టీడీపీ నేతల ఆవేదన అని తెలిపారు. లోకేశ్ తండ్రి అరెస్టు జరిగిన తర్వాత దాదాపు నెల రోజులపాటు ఢిల్లీలో వ్యవస్థల్ని మేనేజ్ చేయటానికే వెళ్లాడని, ఈ వ్యవస్థల మేనేజ్‌మెంటులో వారికి 30ఏళ్లుగా ఉపయోగపడిన, పెద్ద పెద్ద స్థానాల్లో ఉండి దిగిపోయిన మహానుభావులు సైతం ఢిల్లీకి వెళ్లారన్నారు. అక్కడ తమ పాత పలుకుబడిని గట్టిగా ప్రదర్శించారని ఆరోపించారు. వ్యవస్థల్ని మేనేజ్ చేయటానికి టీడీపీ- అనేకమంది మాజీలను, బీజేపీలో టీడీపీ సానుభూతి పరులుగా ఉన్న లీడర్లను సంపూర్ణంగా ఉపయోగించుకుంటోందన్నారు. వ్యవస్థలను మేనేజ్‌మెంట్ చేయడంలో దగ్గుబాటి పురందేశ్వరి దిట్ట అని తెలిపారు. అమిత్‌షా కోసం కాకుండా... లోకేశ్-చంద్రబాబు కోసం రాజకీయం నడిపే ఓ పచ్చి స్వార్థపరురాలిని బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిలో ఉంచవచ్చా? అనేది వారి ఇష్టమన్నారు. ప్రయోజకవర్గాలు చంద్ర బాబును సమర్థిస్తుంటే, సామాజికవర్గాలు (ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు), ఏపీ ప్రజలంతా జగన్‌ను సమర్థిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రజలకు చేయగలిగిన ప్రతి మంచి చేసి, రూ. 2.38 లక్షల కోట్లను డీబీటీ చేసి, పది రకాలుగా సామాజిక న్యాయానికి సీఎం జగన్ అర్థం చెప్పి అడుగులు ముందుకు వేశారని మంత్రులు కొనియాడారు.

ఆల్ ఇండియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ

1 నుంచి 8 వరకు నిర్వహణ

పోస్టర్ విడుదల చేసిన ఏపీబీఏ అధ్యక్షుడు ద్వారకానాథ్

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్ర ప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఏపీబీఏ) విజయవాడలో నవంబరు 1 నుంచి 8 వరకు ఏపీ సీఎం జగన్ యోనెక్స్-సన్‌రైజ్ 2వ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ పోటీల్లో అంతర్జాతీయ క్రీడాకారులు సహా దేశవ్యాప్తంగా 2,200 మంది క్రీడాకారులు పాల్గొంటారు. విజేతలు, రన్నరప్‌లకు దాదాపు రూ.6 లక్షల నగదు బహుమతిని అందజేస్తారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏపీబీఏ అధ్యక్షుడు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ టోర్నీకి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. దండమూడి రాజగోపాలరావు మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియం, చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియం, సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో మ్యాచ్‌లు జరుగుతాయని ఆయన తెలిపారు. నవంబరు 1న టోర్నీని పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజా, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. నవంబరు 1 నుంచి 4వ తేదీ వరకు క్వాలిఫైయింగ్ రౌండ్లు, తరువాత 5వ తేదీ నుంచి 8 వరకు మెయిన్ డ్రా మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడలు, ఆటలకు చాలా ప్రా ముఖ్యత ఇస్తారని, అందుకే ఏపీ సీఎం జగన్ యోనెక్స్-సన్‌రైజ్ 2వ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అని పేరు పెట్టినట్లు వివరించారు. ఈ టోర్నీకి ఇప్పటికే దాదాపు 2,200 ఎంట్రీలు వచ్చాయని, 15 మంది సబ్ జూనియర్ అంతర్జాతీయ ఆటగాళ్లు పాల్గొంటారని, సింగిల్స్‌లో 32 మంది, డబుల్స్‌లో 16 జోడీలు మెయిన్ డ్రా మ్యాచ్‌లకు అర్హత సాధిస్తారని తెలిపారు. టోర్నమెంట్ యువ, రాబోయే ఆటగాళ్లకు వారి ప్రమాణాలను మెరుగు పర్చడానికి గొప్ప అవకాశాన్ని అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏపీబీఏ కోశాధి కారి ఎం.వంశీకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎన్. వెంకట్, కృష్ణా జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పరసా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ పద్మావతి హామీ

విశాలాంధ్ర-విజయవాడ: సహకార సంఘ ఉద్యోగులకు సంబంధించిన జీవోలు 36, 90 అమలు చేసి వారి సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి హామీనిచ్చారు. 2019 తర్వాత నియమితులైన సిబ్బందిని క్రమబద్ధీకరించే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. స్థానిక అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఆదివారం ఏపీ ప్రాథమిక సహకార సంఘ ఉద్యోగుల సమాఖ్య రెండవ రాష్ట్ర మహాసభ సంఘం ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు జనరల్ మేనేజర్ ఎన్.రంగబాబు, ఏపీటీబీఎఫ్ ప్రధాన కార్యదర్శి బీఎస్.రాంబాబు, ఏపీసీసీబీఈఏ చైర్మన్ చలసాని మాధవరావు, వైస్ చైర్మన్ వి.రాధకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్ ప్రసంగించారు. 26 జిల్లాల సహకార సంఘాల ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవం: రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా బండి కరుణాకర్ రెడ్డి (నెల్లూరు), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జే.రామాంజనేయులు(కృష్ణాజిల్లా), ప్రధాన కార్యదర్శిగా బొల్లినేని రాఘురాం(ఎన్టీఆర్ జిల్లా), ముఖ్య ఉపాధ్యక్షుడిగా నీలం నాగేశ్వరరావు (ఏలూరు జిల్లా), ఉప ప్రధాన కార్యదర్శిగా షేక్.ఖాజామోహిద్దీన్ (కర్నూలు), కోశాధికారిగా ఎస్.కొండలశర్మ(ఎన్టీఆర్ జిల్లా) ఎన్నికయ్యారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
Andhra Pradesh State Beverages Corporation Limited
VIJAYAWADA

RFP No.: APSBCL/36/Transportation/Part -II/2023 dated 26.10.2023

E-Procurement Tender Notice

Sealed Bids under two packet tender system (Reverse bidding) are invited by the Managing Director/Andhra Pradesh State Beverages Corporation Limited (APSBCL) Vijayawada-AP through online (ap e procurement portal) from the registered/ licensed and experienced transport agencies/contractors for transportation of carton boxes containing liquor & beer bottles from its 14 whole sale depots to its retail outlets initially for a period of one year. The scope of work includes loading of carton boxes from whole sale depots in to transport vehicles and unloading/stacking the same at the respective retail outlets.
Interested bidders can download the bids online from https://tender.apeprocurement.gov.in (ap e procurement portal) and upload the same in the e procurement portal.
For further details please visit our website: *www.apsbcl.gov.in.*

Managing Director
Andhra Pradesh State Beverages Corporation Limited

సాహితీక్షేత్రాన నిత్య కృషీవలుడు 'నాగసూరి'

సాహితి

బి.జె.పి. పుష్పరాజు

ఊరకరారు మహానుభావులు అంటారు. ఎందుకంటారో తెలియదు. మహానుభావుల్లో మహానుభావులుంటారు. వారు ఊరకే వస్తారు. ఏ ఊరెళ్ళినా ఆ ఊర్లో తమ మనసులకు దగ్గరైన వారెవరైనా ఉన్నారా అని వెతుక్కుని ఆ ఊరికే.... ఊరకే.... వస్తారు! చల్లగాలిలా.... చల్లని వెన్నెల్లా.... చిరువాన జల్లులా మనల్ని కలుసుకుంటారు చిన్నప్పుడు ఎప్పుడో విడిపోయిన బాల్యస్నేహితుల్ని కలుసుకున్నంత సంబరపడతారు.... మనల్ని సంబరపెడతారు!

మేము మర్చిపోలేం...ఎవరోచెప్పగా మా గురించి విని ఓ ఉషోదయాన్నే మా ఇంటి తలుపు తట్టి ధవళ వస్త్రాల్లో మెరిసిపోతూ మా ముంగిట ప్రత్యక్షమైన ఆజానుబాహువు బాలబంధు బి.వి.నరసింహారావు ని! చలం పిచ్చోళ్ళు/ ప్రేమికులు ఇక్కడ ఉన్నారని ఓ సాయంత్రం మమ్మల్ని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న చలం శిష్యులు చిక్కాల కృష్ణారావు (చలం చివరి'కాన్క' వీరి స్వహస్తాలతో రాసిందే!)గారిని! ఇలా ఎందరో! ఇటీవల అలాగే మా ఇంటిని పావనం చేసిన ఆదర్శ దంపతులు నాగసూరి వేణుగోపాల్, హంసవర్ధినిలు.

విజయవాడ ఆకాశవాణి నుండి కొన్నేళ్ళ పాటు తరచూ నాగసూరి పేరు వినని తెలుగు శ్రోతలు ఉండరని చెప్పవచ్చు. ముఖ్యంగా ఉదయరేఖలు... ఒక్కోసారి ఆ కార్యక్రమ ప్రారంభగీతంలా పాల మనసులు సినిమా నుండి 'ఉదయకిరణాల లోన' అంటూ జానకి కమ్మని కంఠం కార్యక్రమానికి కట్టిపడేసేది! అదీగాక మా మనసుల్ని ఇట్టే దోచే వలజ రాగం.... జీవితంపై వలపు కలిగించే రాగం! కార్యక్రమ రూపకర్తకు ఎంత చక్కటి సంగీతాభిరుచి ఉంటే ఇది సాధ్యం! అలా గుర్తుండిపోయిన నాగసూరి ఇటీవల కాలంలో ఫేస్‌బుక్ పుణ్యమా అని మంచి మిత్రులయ్యారు.

ఆకాశవాణి స్టేషన్ డైరక్టర్‌గానే బాగా తెలిసిన ఆయన స్నేహితులయ్యాక ఆయనలోని గొప్ప రచయిత అనుభవమయ్యారు. ముఖ్యంగా శాస్త్రీయ దృక్పథం గల నిరంతర సత్యాన్వేషి. మరి ముఖ్యంగా ఆయన అపార రచనావ్యాసంగం అబ్బురపరచింది. 'సాహితీ వ్యవసాయం' అని అందరి గురించి అలవాటుగా వాడేస్తాము గాని నిజానికి నాగసూరి చేసేది అది! ఎన్ని పంటలు పండించారు! ఎన్ని రకాలుగా పండించారు!! ఎంత విస్తారంగా పండించారు!!! విజ్ఞానం, వినోదం, గాంధేయం, జర్నలిజం, పర్యావరణం, సమాజం, శాస్త్రీయ దృక్పథం ఇలా ఎన్నో విషయాలపై ఆయన రచించని పుస్తకం లేదు. కనీస నీటిసౌకర్యం లేని కరువుప్రాంతమైన ఒకానొక రాయలసీమ జిల్లా అనంతపురంలోని కుగ్రామం ప్రాథమిక విద్య మాత్రమే అందుబాటులో గల కొనతట్టుపల్లి (నేటికీ బస్సు సౌకర్యం లేదట!) నుండి అనేక కష్టనష్టాలకోర్చి, అంతగా చదువుకోకపోయినా చదువు విలువ తెలిసిన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎమ్మెస్సీ పిహెచ్‌డీ చేసి ఆకాశవాణి డైరెక్టరు స్థాయికి ఎదిగారు.

మేము (నేను, నా శ్రీమతి) వృత్తిరీత్యా ఉపాధ్యాయులం కావటం వల్ల జనవిజ్ఞాన వేదిక ద్వారా పాపులర్ సైన్సు సంగతులు చదవడం వినడంద్వారా నాగసూరి బాగా దగ్గరయ్యారు. మిత్రులయ్యాక ఆయన పుస్తకాలు ఒక్కొక్కటి చదువుతూ ఆశ్చర్యానందభరితులయ్యాం! ఉదయ రేఖలు, శతవసంత సాహితీమంజీరాలు, మన తెలుగు, జీవనబింబం, ఆదివాసి అంతరంగం మొదలగు ఎన్నో విభిన్న కార్యక్రమాలతో మూడు దశాబ్దాలపాటు తెలుగు శ్రోతల్ని విశేషంగా అలరించిన ఒక విజయవంతమైన ఆకాశవాణి డైరెక్టరులో ఇంత గొప్ప రచయిత ఉండటం, ఏ విషయాన్నయినా సాధికారికంగా, సూటిగా చెప్పడం, విషయ విశ్లేషణలో శాస్త్రీయతకు, హేతుబద్ధతకు పెద్దపీట వెయ్యడం ఆలోచనాపరులకు ఆయనను మరింత దగ్గరచేసింది. ఆయనలోని శాస్త్రీయ దృక్పథానికి ఆయన స్వగ్రామమే బీజం వేసిందేమో అనిపిస్తుంది. చిన్నతనంలో ఆ ఊరిలో గుడి లేదు కాని బడి ఉందట! అటువంటి గ్రామం ఇప్పుడు ఎక్కడైనా ఉందా!? ఈనాడు కనీసం అట్లాంటి ఊరిని ఊహించగలమా!??

ఆకాశవాణి ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాల్లో పనిచేయడం, విభిన్న రంగాలకు చెందిన ఎందరో మహనీయుల పరిచయం, సాంగత్యం ఆయన జీవితాన్ని సుసంపన్నం చేసాయనిపిస్తుంది. ఏదైనా ఉద్యోగం మామూలుగా చేయడం వేరు, ఆ ఉద్యోగాన్ని ఉత్సవంలా చెయ్యడం వేరు! ఆ వేడుకలన్నింటిలో మనం కూడా పాల్గొన్న అనుభూతి కలుగుతుంది ఆయన రచనలు చదువుతుంటే!

నాగసూరి అసమాన ప్రతిభాపాటవాలకు మరింత వన్నెలద్దే వారి శ్రీమతి హంసవర్ధిని గారిని అభినందించడమే కాదు మనం ఎప్పటికీ ఋణపడి ఉండాలి. వారిద్దరినీ చూసినప్పుడల్లా రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు 'దాంపత్యం లాంటి మైత్రి లేనే లేదూ....' అన్న గజల్ గుర్తొస్తుంది. ఆత్మీయజంట! నిరంతర యాత్రికులు.... నిత్య దేశసంచారం.... ఇష్టమైన ప్రాంతాలు చూడడం, నచ్చిన స్నేహితుల్ని కలుసుకోవడం ఆ ముచ్చట్లన్నీ రచనలుగా తెలుగు పాఠకులతో పంచుకోవడం! నిజంగా ఎంత బాగుంది!!

మహాత్మాగాంధీ, పొట్టిశ్రీరాములు, తాపీ ధర్మారావు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, మూఢనమ్మకాలూ సైన్సు, వార్తామాధ్యమాల విశ్వసనీయత, సైన్సూ కామన్‌సెన్సు, శాస్త్రసమాజం ఇలా ఏ అంశాన్ని తీసుకున్నా ఆబాల గోపాలాన్ని అలరించేట్లు, మనసులకు హత్తుకునేట్లు, విడవక చదివించేట్లు రాయడం నాగసూరి రచనాశైలి విశిష్టత. కాలక్షేపంగా చదువుకునేవి కాకపోవడం, విద్యార్థులకు ఉపాధ్యాయులకు విజ్ఞానపిపాసులకు కరదీపికలుగా నిలిచి వెలిగే వైజ్ఞానిక కథలు, వెలుగుజాడ (గురజాడ) బుల్లితెర విశ్వరూపం, పర్యావరణ శాస్త్రం, సైన్సు క్యాలెండర్, ప్రగతికి ప్రస్థానం, అత్యున్నత కళారూపం సైన్స్, సైన్స్ వైతాళికులు ఇలా చెప్పుకుంటూ పోతే దాదాపు 70 కి పైగా పుస్తకాలు, వేలాది వ్యాసాలు, వివిధ పత్రికలలో ఎన్నో కాలమ్‌లు నాగసూరి వారి నుండి వెలువడ్డాయంటే అద్భుతమనిపిస్తుంది.

చాలా గట్టి (సాహితీ) వ్యవసాయమే చేసారు.... చేస్తున్నారు. వారి వ్యవసాయ క్షేత్రానికి ఎల్లలు లేవు. అంత సువిశాలం! ఆయన కలం హలం బలంతో తెలుగు సాహితీవనం సుభిక్షం కావాలని, వారి జీవితం, విస్తారమైన ఆయన సాహిత్య సృష్టి ఈ తరానికే కాక రాబోయే తరాలకు కూడా మార్గదర్శకం కావాలని ఆశిస్తూ ఈ నెల 29వ తేదీన జానమద్ది సాహితీ పీఠం, కడపవారిచే ప్రతిష్ఠాత్మక 11వ సాహిత్య సేవాపురస్కారం అందుకోబోతున్న శుభసందర్భాన మనసారా అభినందిద్దాం.

మార్పుకోసం పోరుబాట

ప్రభుత్వాలు అనుసరించే వ్యతిరేక విధానమా
దేశ సమైక్యతకు నేడు తీరని రుణపాశమా

1. పోరాడి సాధించిన హక్కులను కాలరాస్తూ
కార్మిక చట్టాలలో పెనుమార్పులు సృష్టించి
కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిన కేంద్రమా
నియంత పాలకులను ఎండగట్టేందుకు కదులుదమా. ॥పోరాడే॥

2. రేయనక పగలనక నిరంతరం శ్రమించేటి
కార్మికులపై నల్లచట్టాలు విధించటమే మూర్ఖత్వం
ప్రైవేటీకరణపై మోజుతో చట్టాలను కాలరాస్తే
కార్మిక సంఘాలతో ఉప్పెనలా కదులుతాము ॥పోరాడే॥

3. మతోన్మాదం రెచ్చగొట్టి, మాయమాటలు చెప్పి నేడు
కార్పోరేట్ శక్తులకు, మోకరెల్లిన కేంద్రమా
నిరంకుశత్వంతో నీవు హక్కులను హరిస్తే
ఎర్రజెండా నీడలో పోరుబాట నడుస్తాం ॥పోరాడే॥

4. డీజిల్, పెట్రోల్, గ్యాస్, ధరలు ఆకాశానంటుతుంటే
ప్రైవేటీకరణ మోజుతో ప్రభుత్వ సంస్థలమ్ముతుంటే
ప్రత్యేక హోదా ఇవ్వని చేతగాని ప్రభుత్వమా
మిమ్ము వెంటాడుతాం. మా హక్కులు సాధిస్తాం. ॥పోరాడే॥

5. సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి
ప్రజలపై పెనుభారం మోపుతున్న రాష్ట్రమా
ప్రాజెక్టుల సాధనకోసం నిరంతరం శ్రమిద్దాం
మడమ తిప్పని మూర్ఖుడా కళ్ళు తెరిచి చూడవయ్యా ॥పోరాడే॥

6. ఆర్‌టిసి, పోర్టుడాల్, విద్యుత్, బొగ్గు, మెడికల్
బ్యాంకు, బీమా, రవాణా, సిమెంట్, స్పిన్నింగ్ మిల్లు
ఎన్నెన్నో పరిశ్రమలు ఎరిగినట్టి మన సంఘం
విప్లవకర పోరాటాల, ఎ.ఐ.టి.యు.సి. యూనియన్
సింహమై పోరాడుతుంది ఎ.ఐ.టి.యు.సి. యూనియన్ ॥పోరాడే॥

7. నేతాజి చంద్రబోసు, లాలలజపతి లాంటి
అతిరథులు. మహారథులు, సమరశీల సారథ్యం
డాంగీ జోషి కృష్ణాన్. గుప్తా బర్దన్ లాంటి
కాకులు తీరిన యోధులను కన్నది ఈ సంఘం ॥పోరాడే॥

8. హక్కులపై ఉద్యమిస్తే ఉక్కుపాదం మోపినారు
పనిభారం పెంచుతూ బానిసగా చూసినారు
ప్రభుత్వాలు మారిన మా తలరాత మారలేదు
మార్పు రక్షణ కోసమై పోరుబాట నడుద్దాం. ॥పోరాడే॥

(ఎఐటి.యు.సి. 104వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా)

రచన- బైరాపట్నం రామకృష్ణ
ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి,
పల్నాడు జిల్లా ప్రధానకార్యదర్శి.

గ్రంథ సమీక్ష

'సుమ' కథా పరిమళాలు

అందమైన దృశ్యం మనల్ని ఎంతగా కదిలిస్తుందో, మనసును కకలావికలం చేసేదైనా అంతే. భావోద్వేగానికున్న శక్తి అది. ప్రతి ఒక్కరికి ఇది అనుభవమే. 'సుమ సౌరభాలు' అనే ఈ కథాసంపుటి రచయిత్రి సుమలతకు ఇది అక్షరాలావర్తిస్తుంది. ఆమెది సాత్వికస్వభావం. దీనినే.. నాలోని నేను.. అంటూ ముందు మాటగా రాసారు. జీవనపోరాట తెగువ, ఆత్మస్థైర్యం, ఆత్మ విశ్వాసాలతో పుస్తక పఠనాసక్తిని, సాహిత్యాభిరుచి తల్లి నుండి పుణికి పుచ్చుకున్నారు సుమలత. అందుకే తన ఉనికికి, తన ప్రతిభా వికాసానికి వెన్నుదన్నుగా నిలిచిన ఆమెకు కృతజ్ఞతాంజలిగా ఈ పుస్తకాన్ని అంకిత మిచ్చారు. పదిహేడేళ్లనుంచి ఆమె కథలు ప్రముఖ వార, మాస పత్రికలలో, ఆదివారం అనుబంధాలలోనూ వచ్చాయి. అప్పటినుండి నేటివరకు ఆ సాహిత్య పయనం సాగుతోంది. బాల సాహితీవేత్త కొక్కెరగడ్డ వెంకట లక్ష్మణరావు స్ఫూర్తితో అరవైకి పైగా చిన్నపిల్లల కథలు రాసారు. ఈ సంవత్సరం జులై 23న తన ప్రథమ కథల సంపుటిని తెచ్చారు. దీనిలో మొత్తం 22 కథలున్నాయి. కొన్నింటిని పరిచయం చేసుకుందాం.

ప్రేమించు మనసు : ఒక వివాహిత స్త్రీ అసంతృప్తికి, ఆకర్షణకి మధ్య జరిగిన సంఘర్షణే ప్రేమించు మనసు కథా ఇతివృత్తం. అక్క యాక్సిడెంట్‌లో చనిపోయి, ఇద్దరు పిల్లలు బెంగపడటంతో అక్క పిల్లలమీద జాలి, ప్రేమలతోపాటు అన్నివిధాల యోగ్యుడు, మంచి ఉద్యోగం, ఉన్న బావగారిని చేసుకోవటానికి సిద్ధపడింది. అనూష, సుధాకర్ మానసికంగా దగ్గర కాలేకపోయారు. వారి మధ్య ప్రేమ, అన్యోన్యతలు అంకురించలేదు. తనూహించిన జీవితానికి, దక్కిన దానికి పొంతనలేక ఎంతో కోపంతో, అసంతృప్తితో ఉండగా వచ్చిన ఒక రాంగ్ ఫోన్‌కాల్ ఆమె మనసు ఎడారిలో ప్రేమచినుకు అయింది. మాధవ్‌తో పరిచయం, ఆకర్షణ పెళ్ళి వరకు వెళ్ళింది. ఆ స్థితిలో పిల్లల్ని శారీరకంగా, మానసికంగా దస్సి పోయిన సుధాకర్‌ను చూసి ప్రేమ ఒక్కసారిగా పొంగింది. ఏదో అపరాధ భావన ఆమె మనసును కుదిపేసింది. అంతే మాధవ్ మోజునుండి బయట పడింది. తన కుటుంబానికి దగ్గరైంది. ఇది మొదటి కథ. అయినా, చక్కని కథనంతో సరళమైనభాషలో పాఠకులకు ఉత్సుకతను కలిగిస్తూ చదివిస్తుంది.

స్వాతిముత్యం : మాటలు సరిగా రాని, వినికిడిలోపంతో తన చెల్లెలితో వస్తూ, స్కూల్‌లో తోటి విద్యార్థుల అవహేళనకు గురవుతూ పిచ్చివాడని ముద్రపడిన రవి అనే కుర్రవాడు శారద టీచర్ దృష్టి నాకర్షించాడు. తల్లి ప్రేమగా దగ్గరకు తీసుకుని హెడ్ మాస్టారును ఒప్పించి అతణ్ణి స్కూల్‌లో చదువుకునే అవకాశం కలిగిస్తుంది. అతనిలోని డాన్స్‌చేసే ప్రతిభను గుర్తించి దాన్ని ప్రోత్సహిస్తుంది. తరువాత అటువంటి ఇబ్బంది ఉన్నవారి స్కూల్లో అతణ్ణి చేర్పించి చదువు చెప్పించే ఆర్థిక బాధ్యత తీసుకుంటుంది. రవి బాగా చదువుకుని, ఐ.ఎ.ఎస్ టాపర్‌గా వచ్చిన విషయం పేపర్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూవల్ల తెలుసుకుని ఎంతగానో ఆనందించింది శారద. ఈమెలాంటి వ్యక్తులు సమాజానికి కావాలి.

నువ్వు.. నేను.. మనమై! : కథ మొత్తం సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులైన వినీల్, హరిత అనే భార్యభర్తలమధ్య జరిగే సంఘర్షణ. తల్లి చనిపోవటంతో వినీల్ తండ్రిని విశ్వం తన దగ్గరకు తెచ్చుకున్నాడు. మామగారికి సేవలు చేస్తూ తన ఉద్యోగంసమర్థంగా చేసుకుంటోంది హరిత. ఒకసారి విశ్వంకి జ్వరంవచ్చింది. మామగారికి అన్నీ అమర్చితన కంపెనీలోఉన్న అర్జెంట్ మీటింగ్‌కి వెళుతున్న హరితతో, 'ఈరోజుకి నువ్వు ఇంట్లోఉంటే బావుంటుంది' అన్నాడు. కాని ఆ అవకాశమే లేదంటూ ఆమె వెళ్ళిపోయింది. తన తండ్రిని హరిత సరిగా చూడటం లేదనుకున్నాడు వినీల్. కానీ ఆమె తనలాగే బిజిగాఉండే ఉద్యోగన్న విషయాన్ని విస్మరించాడు. అపార్థాలు, వాగ్వివాదాలు పెరిగి చివరకు విడాకులు తీసుకున్నారు. కొద్దికాలమైన తరువాత ఇద్దరిలో ఇద్దరికీ ఏదో తెలియనివెలితి. ఓ పశ్చాతాపభావన. ఆత్మావలోకనం, విచక్షణల పిదప మళ్ళీకలుసుకోవాలని నిర్ణయంతో కథ ముగుస్తుంది. కథనంలో ఎంతో బిగువు చూపుతూ కథను బాగా నడిపారు రచయిత్రి. ఇరువురి మనోభావాలకు తగిన భాష. 'నేను వర్క్ లోడ్ తగ్గించుకుంటున్నాను. టూర్స్ క్యాన్సిల్ చేసుకున్నాను..ఇంటి దగ్గర ఉండే సమయం పెంచుకుంటున్నాను. నీకిష్టమేనా హరి?' అన్న వినీల్ మెసేజ్ కి, 'ఇష్టమే నేను కూడా వేరే జాబ్ చూసుకుంటున్నాను మావయ్యని చూసుకోవటానికి వీలుండేలా.. నీకేం అభ్యంతరం లేదు కదూ!' హరిత రిప్లై గాలిలో అలా అలా తేలుతూ వినీల్ ఫోన్ చేరింది. ఈ పదబంధాలు వారి ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని, తేట అయిన వారి మనసులను తెలుపుతున్నాయి కదూ!

నాన్ సేఫ్టీ టచ్ : ఎంతో అందంగా ఉండే గ్రీష్మ ఆనంద వివాహ ఆనంద జీవితంలో ఆమె భర్త రోడ్డు ప్రమాదంలో మరణించటం పెద్ద ఘోరం. అయినా, గుండె నిబ్బరం చేసుకుని, ఆత్మ విశ్వాసంతో ఉద్యోగం చేసుకుంటూ కూతురు వైష్ణవిని పెంచుతూ జీవిత పోరాటాన్ని చేస్తోంది. ఆమె ప్రశాంత మనోతరంగణిలో లక్షణ్ ఒక పెద్ద అవరోధమయ్యాడు. తన వాక్చాతుర్యంతో, అందంతో ఆమెను వశపరచుకుని ఆమెకు తోడు, వైష్ణవికి తండ్రినవుతానన్న అతని మాటలు నమ్మి దారుణంగా మోసపోయింది. తనని, తన బిడ్డను హింసిస్తున్న అతని రాక్షసత్వాన్ని భరిస్తూ వస్తోంది. కాని అతడిలోని కాముకతా విషసర్పం వైష్ణవిని కాటువేయబోవటం చూసి భరించ లేకపోయింది. అతనికి గట్టి బుద్ధి చెప్పి, తన జీవితం నుండి తరిమేసింది. వైష్ణవిని జాగ్రత్తగా చూసుకుంటూ జీవన పోరాటాన్ని సాగించే స్వయంసిద్ధ అయింది.

సంపుటిలోని ఇతర కథలూ ఎంతో ఆసక్తిగా చదివిస్తాయి. ఈమెకు కథ చక్కగా పలుకు తుంది. భావ స్పష్టత, పాత్రోచిత సంభాషణలతో కథను నేర్పుగా, ఒడుపుగా చెప్పగల ఈ రచయిత్రి తన ఆలోచనావిస్తృతిని పెంచుకుంటే మరిన్ని వైవిధ్యభరితమైన కథలు రాయగలరు.

బొడ్డపాటి చంద్రశేఖర్, 63003 46501.

హంతకులకు దేశభక్తుల ముసుగా?

కొన్ని నిజాలు ఎంతదాచినా దాగవు. మరికొన్ని నిజాలను దాచడానికి నిరంతర ప్రయత్నం సాగుతూ ఉంటుంది. 1948 జనవరి30న మహాత్మా గాంధీ హత్యవెనక హస్తం ఆర్.ఎస్.ఎస్.దే అన్నది దాచినా దాగనిసత్యం. కాని ఆర్.ఎస్.ఎస్. ఇంతవరకు ఆ సత్యాన్ని అంగీకరించలేదు. మహాత్మాగాంధీని హతమార్చిన నాథూరాంగాడ్సే ఈ హత్య చేసినప్పుడు ఆర్.ఎస్.ఎస్. సభ్యుడుకాదు అని వాదించడానికే ప్రయత్నించింది. కాని నాథూరాంగాడ్సే సోదరుడు గోపాల్ గాడ్సే తాను, తన సోదరుడు నాథూరాంగాడ్సే ఎప్పుడైనా ఆర్.ఎస్.ఎస్. భావజాలానికి నిబద్ధులమై ఉన్నవాళ్లమేనని చెప్పారు.

జరిగిన పొరపాటును అంగీకరించడానికి అపారమైన మానసికస్థైర్యం ఉండాలి. మే27వ తేదీన అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా హిరోషిమా శాంతిపార్కుకు వెళ్లి అక్కడ పుష్పగుచ్ఛమైతే ఉంచారు కాని 1945 ఆగస్టు ఆరున, ఆ తర్వాత మరో మూడురోజులకు నాగసాకి మీద అణుబాంబులు కురిపించినందుకు క్షమాపణ మాత్రం చెప్పలేదు. 1984లో ఉత్తరాదిన, ప్రధానంగా దిల్లీలో సిక్కుల మారణకాండ తర్వాత కాంగ్రెస్ కూడా క్షమాపణ చెప్పలేదు. 2011లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మాత్రం క్షమాపణ చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ విచారం వ్యక్తం చేయడంతో సంతృప్తిపడ్డారు.

గాంధీహత్య విషయంలో ఆర్.ఎస్.ఎస్. ఇప్పటికీ గాడ్సేకు తమకు ఏ సంబంధంలేదు అని నమ్మబలకడానికే ప్రయత్నిస్తోంది. అక్కడితో ఆగకుండా గాంధీ హంతకుడిని దేశభక్తుడిగా, వీరుడిగా చిత్రీకరించడానికి ప్రయత్నం చేస్తోంది. ఆర్.ఎస్.ఎస్. భావజాలం ఉన్న వార్ అధికారంలో ఉన్నప్పుడల్లా ఈ ప్రయత్నాలు మరింత ముమ్మరం అవుతుంటాయి. చరిత్రను వక్రీకరిస్తూ ప్రదీప్దాల్వీ "మీ నాథూరాం గాడ్సే బోల్తోయ్" అన్న నాటకమే రాశారు. మీరట్లో గాడ్సేకి ఏకంగా గుడికట్టారు. గాంధీ హంతకుడైన గాడ్సేతో తమకు సంబంధంలేదని చెప్పడానికి ఆర్.ఎస్.ఎస్. చేయాల్సిన ప్రయత్నమల్లా చేసింది. 2014లో కేంద్రంలో బీజేపీప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూమహాసభ మళ్లీ గాడ్సేను దేశభక్తుడిగా చిత్రీకరించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. గాడ్సే విగ్రహాన్ని ఆవిష్కరించాలని ప్రధానిమోదీనే ఆహ్వా నించింది. "దేశభక్త నాథూరాంగాడ్సే" అన్న డాక్యుమెంటరీ చిత్రాన్ని నిర్మించింది. గాంధీ ప్రాణాలు అర్పించినరోజును శౌర్యదివస్గా జరపాలని సంకల్పించింది. ఆర్.ఎస్.ఎస్. భావజాలం ఈ చేష్టలకు భిన్నమైంది ఏమీకాదు.

ఈ వాదనలను తిప్పికొట్టడానికి కావాల్సిన సాక్ష్యాధారాలన్నింటినీ గుదిగుచ్చి తీస్తాసెతల్వాద్ 2015లో "బియాండ్ డౌట్- అడోసియర్ ఆన్ గాంధీస్ అసాసినేషన్" అన్న గ్రంథం వెలువరించారు. గాంధీ హత్య సెక్యులరిజం మీద, ప్రజాస్వామ్యం మీద, వీటికి కట్టుబడి ఉన్న వారిమీద యుద్ధం ప్రకటించడమేనని రుజువు చేయడానికి సెతల్వాద్ తగిన సమాచారాన్ని ఈ గ్రంథంలో చేర్చారు. గాంధీ హత్య "హిందూ రాష్ట్ర" నిర్మాణ సంకల్పాన్ని బలంగా ప్రకటించడమేనని సెతల్వాద్ అంటారు. గాంధీని హతమార్చడమంటే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతీయోద్యమం ప్రోదిచేసిన సకల విలువల్ని నిర్మూలించడమేనన్నది సెతల్వాద్ వాదన.

గాంధీహత్య వ్యక్తిగతకక్ష వల్ల జరిగింది కాదు. ఆవేశంలో చేసిన హత్యాకాదు. పథకం ప్రకారం గాడ్సే ఈ కిరాతకానికి పాల్పడ్డాడు. అంతిమంగా గాంధీని హతమార్చడంలో సఫలం కావడానికి జరిగిన హత్యా ప్రయత్నాలతో గాడ్సేకు సంబంధం ఉంది. గాంధీ హత్యకు ఓ రాజకీయ సందర్భం ఉంది. మతతత్వవాదులు అధికారంలోకి వచ్చినప్పుడల్లా గాంధీహత్యకు గల కారణాలకు మసిపూయడానికి, గాడ్సేను వీరుడిగా కీర్తించడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

ఆర్.ఎస్.ఎస్.కు నాల్గవ సర్ సంఘ్‌చాలక్‌గా పనిచేసిన రజేంద్రసింగ్ (రజ్జూభయ్యా) గాడ్సే కిరాతకంగా శాంతిదూత అయిన గాంధీని హతమార్చడాన్ని తప్పుపట్టలేదు. 1999 జనవరి19 నాటి అవుట్‌లుక్ పత్రికలో ప్రచురిత మైన ఇంటర్వ్యూలో రజ్జూభయ్యా "అతని (గాడ్సే) ఉద్దేశం మంచిదేకాని అనుసరించిన మార్గం తప్పు అని నిర్మొహమాటంగా చెప్పడం గాంధీ హత్యమీద ఆర్.ఎస్.ఎస్. అభిప్రాయం ఏమిటో స్పష్టం చేస్తోంది. గాడ్సే అఖండభారత్ అన్న సిద్ధాంతంతో ప్రేరిపితుడైనవాడు అని రజ్జూభయ్యా చెప్పడం కూడా గాడ్సేను సమర్థించడమే.

గాడ్సే మొదట్లో కొంతకాలం కాంగ్రెస్‌లో ఉన్నాడు. ఆ తర్వాత ఆర్.ఎస్.ఎస్.లో చేరాడు. కొంతకాలానికి ఆర్.ఎస్.ఎస్.ను విడనాడాడు. దీనికి కారణం ఆర్.ఎస్.ఎస్. అంత క్రియాశీలం కాదని భావించడమే. గాడ్సే సొంతంగా ఒకసంస్థను కూడా ప్రారంభించాడు. ఆయనకు హిందూ మహాసభతోనూ సంబంధం ఉండేది. హిందూ మహాసభ ప్రధాన కార్యకార్యదర్శి ఆచార్య మదన్ గాడ్సే మహాత్మాగాంధీని హత్యచేయడాన్ని సమర్థించడానికి ఏమాత్రం మొహమాట పడలేదు. "ఒక లక్ష్యం కోసం హత్యచేయడం నేరం కాదు. దేశభక్తుడైన గాడ్సే గాంధీని హత్య చేయడానికి కారణం ఉంది. దేశ విభజన సందర్భంగా జరిగిన కలహాల్లో పదిలక్షలమంది హిందువులు మరణించడానికి బాధ్యత గాంధీదే" అని ఆచార్య మదన్ స్పష్టంగానే చెప్పారు. దేశ విభజనకు కారకుడు గాంధీయేనని, అయితే దురదృష్టవశాత్తు దేశాన్ని విడదీసినందుకు గాంధీమీద చర్య తీసుకోవడానికి ఏ చట్టమూ లేనందువల్ల గాడ్సే చేయాల్సిందే చేశాడు" అని ఆచార్యమదన్లేగేసి చెప్పారు. గాంధీ హత్య తర్వాత ఆర్.ఎస్.ఎస్.వారు మిఠాయిలు పంచుకోవడం, అప్పటి ప్రభుత్వం ఆర్.ఎస్.ఎస్.ను నిషేధించడం మొదలైన సంఘటనలన్నీ గాంధీని హతమార్చడం ఆర్.ఎస్.ఎస్.కు సంతోషమే కలిగించిందని చెప్పడానికి కావాల్సిన ఆధారాలన్నింటినీ సెతల్వాద్ సేకరించి ఈ గ్రంథంలో పొందుపరిచారు.

గాంధీని హత్యను సమర్థించడానికి గాడ్సే సమర్థకులు అనేక అసత్యాలను ప్రచారంలో పెట్టారు. ముస్లింలకు ప్రత్యేక దేశం ఉండాలన్న వాదనను గాంధీ సమర్థించారు కనక పాకిస్తాన్ ఏర్పడడానికి కారకుడు ఆయనే అన్నది ఈ వాదనల్లో ప్రధానమైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాకిస్తాన్‌కు 55కోట్లు ఇచ్చి తీరాలని పట్టుబట్టడానికే కశ్మీర్‌పై పాకిస్తాన్ దాడికి తెగబడినా పాకిస్తాన్‌కు ఆ డబ్బు అందించేలా చేయడానికి గాంధీ నిరాహారదీక్షకు పూనుకున్నారన్నది మరో వాదన. ఈ వాదన ఎంత అసంబద్ధమైందో నిరూపించడానికి సెతల్వాద్ ఈ గ్రంథంలో తిరుగులేని ఆధారాలు చూపించారు. ముస్లింలు కయ్యానికి కాలుదువ్వేలా ప్రవర్తించడానికి గాంధీ ముస్లింలను సంతృప్తిపరచడమేనన్న వాదనలు ఇప్పటికీ వినిపిస్తూనే ఉన్నాయి.

దేశవిభజనకు ముందు ముస్లింలలో కొంతమంది గాంధీని హిందువుల నాయకుడిగానే పరిగణించారు. పాకిస్తాన్ ఏర్పడకపోవడానికి గాంధీనే పెద్ద అడ్డంకి అనుకున్నారు. మరోవైపున హిందువుల్లో కొంతమంది హిందువుల మీద జరుగుతున్న అత్యాచారాలకు ప్రతీకారం తీర్చుకోకుండా అడ్డు తగులుతున్నది గాంధీయేనని భావించారు. గాంధీ మీద హిందువుల్లో ఉన్న ఈ భావనే కరడుగట్టిన హిందూ భావజాలానికి దారితీసింది. గాడ్సే అలాంటి భావజాలం కలిగినవాడే. ఈ భావజాలం కుదుళ్లు ఆర్.ఎస్.ఎస్., హిందూ మహాసభ సిద్ధాంతాల్లో ఉన్నాయి.

1934 నుంచి మొదలై పధ్నాలుగేళ్ల కాలంలో గాంధీమీద ఆరుసార్లు హత్యాయత్నం జరిగింది. 1934, 1944 జులై లోనూ, సెప్టెంబర్లోనూ, 1946లోనూ హత్యాయత్నాలు జరిగినప్పుడు పాకిస్తానుకు రూ. 55కోట్లు చెల్లించడం అనే ప్రస్తావన సోదిలో కూడా లేదు. దీన్ని బట్టి ఆ అంశం గాంధీహత్యకు దారితీసిందని ప్రచారం చేయడం ఎంత పకడ్బందీగా అల్లిన కట్టుకథో అర్థం అవుతుంది. గాడ్సే గాంధీని హతమార్చిన సమయంలో గాడ్సేతో తమకు ఏసంబంధమూ లేదని ఆర్.ఎస్.ఎస్. ఎన్ని కబుర్లుచెప్పినా వాస్తవం ఏమిటో తెలుసుకోవాలనే ఓపిక ఉన్న వారికి ఈ పుస్తకం తోడ్పడుతుంది. తీస్తా సెతల్వాద్ పత్రికా రచయితగా మొదలై సామాజిక కార్యకర్తగా ఎదిగారు. గుజరాత్ మారణకాండ బాధితులకు అండగా నిలిచిన పాపానికి ఆమెను బీజేపీప్రభుత్వాలు ఇప్పటికీ వేధిస్తూనే ఉన్నాయి. ఎలాగైనా జైలుపాలు చేయాలని ప్రయత్నిస్తున్నారు.

ఆర్వీరామారావ్

షర్మిలా ఠాగూర్‌కు జేఎంఐ వర్సిటీ పురస్కారం

న్యూఢిల్లీ: ప్రముఖ నటి షర్మిలా ఠాగూర్ జామియా మిలియా ఇస్లామియా (జేఎంఐ) విశ్వవిద్యాలయం అత్యున్నత గౌరవ పురస్కారం ఇంతియాజ్-ఎ-జామియాను అందుకున్నారు. వర్సిటీ 103వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో జేఎంఐ వైస్ ఛాన్సలర్ నజ్మా అఖ్తర్ ఈ అవార్డును ఠాగూర్‌కు ప్రదానం చేశారు. నటిగా హిందీ సినీ రంగానికి ఆమె అందించిన సేవలకు గాను ఆమెకు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఠాగూర్ మాట్లాడుతూ... 'నేను విశ్వవిద్యాలయంలోకి ప్రవేశించిన క్షణం నుంచి నేను ఉద్విగ్నతకు గురవుతున్నాను... జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ మొదటి మహిళా వైస్ ఛాన్సలర్ చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందుకోవడం నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది. నేను ఎంతో గర్విస్తున్నాను' అని ఆమె తెలిపారు. జేఎంఐ వీసీ అఖ్తర్, డైరెక్టర్ శివ్ కుమార్ సారిన్‌లతో కలిసి ఠాగూర్ వర్సిటీ శతాబ్ది గేట్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్సిటీ జెండాను వీరు ఆవిష్కరించారు. ఇంతియాజ్-ఎ-జామియా అనేది జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ అత్యున్నత పురస్కారం... ఇది సమాజ అభివృద్ధిలో భాగంగా వివిధ రంగాల్లో అత్యున్నత సేవలందించిన వారికి ఇవ్వడం జరుగుతుంది.

'మహా' అవినీతి!

- భవన నిర్మాణ కార్మికుల నిధులు బొక్కేశారు
- భోజనం పెట్టకండానే పెట్టినట్టు లెక్కలు
- కోట్లాది రూపాయలు స్వాహా?

ముంబై: మహారాష్ట్రలో భారీ కుంభకోణం బయటపడింది. భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్టు సమాచారం. దీంతో వచ్చే నెల నుంచి ఈ పథకాన్ని నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కరోనా సమయంలో భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవడానికి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. మహారాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి వద్ద ఉన్న రూ.16,000 కోట్ల నిధుల్లో కొంతమేర ఉపయోగించుకుంటూ పథకాన్ని కొనసాగించారు. అయితే ప్రతి నెలా 7 నుంచి 8 లక్షల మంది కార్మికులకు భోజనాలు పెట్టినట్టు లెక్కల్లో చూపారు. కరోనా సద్దుమణిగే నాటికి రూ.2,500 కోట్లు ఖర్చు అయినట్టు లెక్కల్లో తెలిపారు. అయితే, ఈ లెక్కలనీ తప్పులతడకలేనని విచారణలో తేలినట్లు తెలిసింది. జల్గాం జిల్లాలోనే 70 వేల మంది కార్మికులకు భోజనాలు పెట్టినట్టు లెక్కల్లో చూపి రూ.24 కోట్లు తీసుకున్నారు. భోజనాలు చేసిన వారిలో 80 ఏళ్ల వృద్ధులు కూడా ఉన్నారు. ధారా శివ్ జిల్లాలో పేరు నమోదు చేసుకున్న కార్మికులు 7,915 మంది కాగా 35,216 మందికి భోజనాలు పంపిణీ చేసినట్టు లెక్కల్లో చూపారు. భోజనాల పంపిణీ కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఈ కుంభకోణానికి పాల్పడినట్టు తెలుస్తున్నది. పథకంలో అవినీతిపై ఎన్సీపీ ఎమ్మెల్యే ఏక్‌నాథ్ ఖడ్సే విధాన పరిషత్‌లో ప్రశ్నించారు. ఇదే సమయంలో ప్రతిపక్ష నేతలు విజయ్ వడెట్టివార్, నానా పటోలే, అనిల్ దేశ్‌ముఖ్ కూడా ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో స్పందించిన కార్మిక శాఖ మంత్రి సురేశ్ ఖడ్సే ఈ అవినీతిపై నిజానిజాలు వెలికితీసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం నవంబరు1 నుంచి ఈ పథకాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

యువశక్తి ఐక్యానికి 'మేరా యువ భారత్'

'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా దేశ యువత కోసం 'మేరా యువ భారత్' వేదికను ప్రారంభించబోతున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. దేశ నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించేందుకు ఇది అవకాశాలను కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆదివారం (29-10-2023) ఆల్ ఇండియా రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ 106వ ఎపిసోడ్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. గాంధీ జయంతి రోజున దేశ రాజధాని ఢిల్లీలో ఖాదీ దుస్తుల అమ్మకాలు రికార్డు స్థాయిలో జరిగిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మరోవైపు 'లోకల్ ఫర్ వోకల్'కు మద్దతుగా గత నెలలో దేశ ప్రజలందరు ఖాదీ దుస్తులతో పాటు దేశీయంగా తయారైన వస్తువులను ఎక్కువగా కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాకుండా రాబోయే పండగలకు కూడా ఇదే స్ఫూర్తితో స్థానికంగా తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని దేశ ప్రజలను కోరారు. లోకల్ ఫర్ వోకల్ నినాదానికి ఇది బలాన్ని ఇస్తుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని యువత MyBharat.Gov.in లో తమ పేరును తప్పక రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. సర్దార్ పటేల్ జయంతి రోజైన అక్టోబర్ 31న దేశంలో అతిపెద్ద సంస్థ ను ప్రారంభించబోతున్న విషయాన్ని ప్రధాని చెప్పారు. దేశ అభివృద్ధిలో యువత కీలకంగా వ్యవహరించేందకు మై భారత్ అవకాశాలను కల్పిస్తోందన్నారు. అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించేందుకు దేశంలోని యువశక్తిని ఏకీకృతం చేయడానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. దేశంలోని అన్ని రంగాలు వృద్ధి సాధిస్తేనే యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడంలో భారతదేశం యొక్క యువశక్తిని ఏకం చేయడానికి ఇది ఒక ప్రత్యేకమైన ప్రయత్నమని ప్రధాన మంత్రి అన్నారు. అక్టోబర్ 31 మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా... ఆమెకు నివాళులు అర్పిస్తున్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు.

భూ వివాదంలో కోర్టుకు రండి

యూపీ గవర్నర్‌కు న్యాయస్థానం ఆదేశం : ఆగ్రహించిన ఆనందీబెన్ పటేల్

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో విచిత్రమైన, అరుదైన ఘటన జరిగింది. ఓ కుటుంబ భూ వివాదానికి సంబంధించి స్థానికుడొకరు చేసిన ఫిర్యాదు ఆధారంగా రాష్ట్ర గవర్నర్ ఆనందీబెన్ పటేల్‌కు బదౌన్ జిల్లా సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ (ఎస్‌డీఎం) వినీత్ కుమార్ సమన్లు జారీ చేశారు. దీనిపై గవర్నర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో వాదనలు విన్పించేందుకు, సాక్షులను ధృవీకరించేందుకు కోర్టుకు రావాలని ఈ నెల 10న జారీ చేసిన ఆదేశాలలో ఎస్‌డీఎం సూచించారు. 'ఒకవేళ మీరు అక్టోబర్ 18వ తేదీన కోర్టుకు హాజరుకాని పక్షంలో ఈ కేసులో నిర్ణయం ఏకపక్షంగా ఉంటుందని మీకు తెలియజేస్తున్నాము' అని ఆ ఆదేశాలలో పేర్కొన్నారు. కాగా కోర్టు సమన్లు అత్యంత అభ్యంతరకర మైనవని ఉత్తరప్రదేశ్ గవర్నర్ కార్యాలయం తెలిపింది. ఈ కేసులో చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని బదౌన్ జిల్లా మెజిస్ట్రేట్‌కు సూచిం చింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కూడా పేర్కొంది. ఈ మేరకు జిల్లా మెజిస్ట్రేట్‌కు యూపీ గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ఒక లేఖ రాశారు. 'ఈ ఘటన రాజ్యాంగంలోని ఆర్టికల్ 361ని ఉల్లంఘిస్తోంది. రాష్ట్రపతి, గవర్నర్ లేదా రాజ్ ప్రముఖ్ పదవిలో ఉన్నప్పుడు వారికి వ్యతిరేకంగా ఎలాంటి క్రిమినల్ చర్యలు చేపట్టకూడదని ఆ అధికరణ స్పష్టం చేస్తోంది' అని ఆ లేఖలో వివరించారు. కాగా ఫిర్యాదుదారుడైన చంద్రహాస్ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ప్రకారం చంద్రహాస్ కుటుంబానికి చెందిన భూమిని బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం తీసుకుంది. ఆ భూమికి ఆయనే హక్కుదారుడైనప్పటికీ ఆయన సోదరుడు దానిని మూడో వ్యక్తికి అమ్మేశాడు. ఆ మూడో వ్యక్తికే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. దీంతో చంద్రహాస్ రాష్ట్ర గవర్నర్‌ను, స్థానిక అధికారులను ప్రతివాదులుగా చేర్చి కోర్టులో కేసు వేశారు. దీనిపై గవర్నర్‌కు ఎస్‌డీఎం సమన్లు జారీ చేశారు.

బీజేపీ నేత సురేశ్‌గోపీ వెకిలిచేష్టలు

మహిళా జర్నలిస్టుపై అనుచిత ప్రవర్తన

కోజికోడ్: బీజేపీ నేత, నటుడు సురేశ్ గోపి ఒక మహిళా జర్నలిస్టు పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. కొజికోడ్‌లో విలేకర్ల సమావేశంలో పాల్గొన్న ఆయన మహిళా జర్నలిస్టు అనుమతి లేకుండానే ఆమెను పదే పదే తాకారు. ఆయన వెకిలి చేష్టలపై మహిళా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. సురేశ్ గోపీ తనను అవమానించారని జిల్లా ఎస్పీకి బాధిత జర్నలిస్టు ఫిర్యాదు చేశారు. కేరళలో ఇంతవరకు ఒక్క సీటు కూడా గెలవకపోవడంపై ఆ మహిళా జర్నలిస్టు గోపిని ప్రశ్నించారు. దీనికి ఆయన స్పందిస్తూ ఆమె భుజంపై పదేపదే చేయి వేస్తూ కనిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో కూడా వైరల్ అవుతోంది. బాధిత మహిళా ఆయన చేయి తీసిపారేస్తున్నా ఆయన తన వెకిలిచేష్టలు ఆపలేదు. 'మమ్మల్ని ప్రయత్నించనీ తల్లీ..'. అంటూ చేయి వేస్తూనేవున్నారు. ఆయన వైఖరిని గమనించిన మహిళా జర్నలిస్టు గట్టిగా తోసివేసిన దృశ్యాలు వీడియోలో కనిపించాయి. దీంతో ఆయనపై కేసు నమోదైంది. మహిళా జర్నలిస్టు ఫిర్యాదు మేరకు సురేశ్ గోపీపై నడకావు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె కోజికోడ్ నగర ఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో విచారణ కోసం కేసును నడకావు పోలీసులకు అప్పగించారు. నటుడి ప్రవర్తనతో తాను మానసికంగా కలత చెందానని జర్నలిస్టు పేర్కొన్నారు. ఆయనపై సెక్షన్ 354ఏ కింద అభియోగాలు మోపినట్లు పోలీసులు తెలిపారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేరళ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ కోరింది. కేరళ రాష్ట్ర మహిళా కమిషన్ సైతం స్పందించి జిల్లా పోలీస్ చీఫ్ నుంచి నివేదికను కోరింది. సురేశ్ గోపీ ప్రవర్తనపై నెటిజన్లతో పాటు అనేక మంది సినీ ప్రముఖులు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. మహిళా జర్నలిస్టుకు క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ ద్వారా పోస్ట్ పెట్టిన ఆయన క్షమాపణలు కోరారు. తాను ఆమెను కుమార్తెగా భావించాననీ, ఆప్యాయంగానే భుజంపై చేసి వేశానన్నారు. జర్నలిస్ట్ అభిప్రాయాన్ని గౌరవిస్తున్నాననీ, తన ప్రవర్తతో ఇబ్బంది పడినట్లయితే క్షమాపణ చెబుతున్నట్లు పోస్ట్ పెట్టారు.

సనాతన ధర్మ రక్షణకు సిక్కు సమాజ కృషి మరువలేం: రాజ్‌నాథ్



లక్నో: సనాతన ధర్మాన్ని పరిరక్షించడంలో సిక్కు సమాజం ఎంతో కృషి చేసిందని, రామజన్మభూమి ఉద్యమాన్ని ప్రారంభించింది సిక్కులేనని, వారి సహకారం ఏ భారతీయుడూ మరచిపోలేరని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆదివారం లక్నోలోని అలంబాగ్ గురుద్వారాలో జరిగిన గురుగ్రంథ సాహిబ్ ప్రకాష్ ఉత్సవ్ సభలో ప్రసంగిస్తూ సింగ్ ఈ విషయం చెప్పారు. 'సనాతన ధర్మాన్ని రక్షించడానికి, రామజన్మభూమి కోసం కూడా చాలా చేసింది. వారి సహకారాన్ని ఏ భారతీయుడు మరచిపోలేడు' అని సింగ్ అన్నారు. "ప్రభుత్వ రికార్డు ప్రకారం నేను ఒక ముఖ్యమైన వాస్తవాన్ని తెలియజేయాలనుకుంటున్నాను. ఎఫ్ఐఆర్ ప్రకారం డిసెంబర్ 1, 1858న గురు గోవింద్ సింగ్ నినాదాలు చేస్తున్న సిక్కుల బృందం ఆ ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకుని గోడలపై ప్రతిచోటా 'రామ్ రామ్' అని రాసింది. రామ జన్మభూమి ఆందోళనను సిక్కులే ప్రారంభించారు" అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఇప్పుడు అందరూ తమ హక్కుల గురించి మాట్లాడుతున్నారని, తమ విధుల గురించి కాదని సింగ్ అన్నారు.

శ్రీనగర్‌లో పోలీస్ అధికారిపై కాల్పులు

శ్రీనగర్: ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో జమ్మూకశ్మీర్ పోలీస్ అధికారి తీవ్రంగా గాయపడ్డారు. శ్రీనగర్‌లో ఆదివారం ఇన్‌స్పెక్టర్ మస్రూర్ అహ్మద్ వానీ ఈద్గా మైదానంలో స్థానిక కుర్రాళ్లతో క్రికెట్ ఆడుతుండగా ఉగ్రవాదులు కాల్పులు జరపగా మస్రూర్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటను ఆయన్ను ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. వైద్యులు అతనికి చికిత్స అందిస్తున్నారని, పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. 'శ్రీనగర్‌లోని ఈద్గా సమీపంలో ఇన్‌స్పెక్టర్ మస్రూర్ అహ్మద్‌పై ఉగ్రవాదులు కాల్పులు జరిపి గాయపరిచారు. అతన్ని వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఇందుకోసం ఉగ్రవాదులు ఓ పిస్టల్ ఉపయోగించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు' అని కశ్మీర్ జోన్ పోలీసులు 'ఎక్స్'లో పెట్టిన పోస్ట్‌లో వెల్లడించారు.

చిన్న పార్టీల ఉచ్చులో పడొద్దు

ఓటర్లకు దిగ్విజయ్ పిలుపు

భోపాల్: మధ్యప్రదేశ్‌లో కేవలం రెండు పార్టీలు మాత్రమే ఉన్నాయి...ఓటర్లు చిన్న చిన్న పార్టీల ఉచ్చులో పడకూడదని, అవి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోవని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ దిగ్విజయ్ సింగ్ ఆదివారం అన్నారు. 'మధ్యప్రదేశ్‌లో రెండు పార్టీలు మాత్రమే ఉన్నాయి. కాంగ్రెస్ లేదా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తాయి. చిన్న పార్టీలు (రాష్ట్రంలో) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవు. కాబట్టి, వారి ఉచ్చులో పడవద్దని నేను ఓటర్లందరినీ అభ్యర్థిస్తున్నాను' అని సింగ్ అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో ఓ వీడియో ప్రకటన పోస్టు చేశారు. రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్), సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), గోండ్వానా గంతంత్ర పార్టీ (జీజీపీ) పోటీ చేస్తున్నాయి. గతంలో ఎస్పీ, బీఎస్పీ, జీజీపీ కొన్ని స్థానాలు కూడా గెలుపొందాయి. రాష్ట్ర ప్రజలు 20 ఏళ్ల 'దుష్పరిపాలన' తర్వాత మార్పు కోరుకుంటున్నారని, కమల్‌నాథ్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని దిగ్విజయ్ పేర్కొన్నారు. 'కాంగ్రెస్‌కు ప్రజల బలం ఉంది. బీజేపీకి డబ్బు బలం ఉంది. మనమందరం కలిసి పని చేసి బీజేపీ ఓడిద్దాం. ప్రజా బలం గెలుస్తుంది, ధనబలం ఓడిపోతుంది' సింగ్ స్పష్టం చేశారు. అక్టోబరు 30న తాను మధ్యప్రదేశ్ హోంమంత్రి,నరోత్తం మిశ్రా పోటీ చేస్తున్న దతియాకు వెళ్లి అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొంటానని సింగ్ చెప్పారు.

మరాఠాలు, ధంగ్రాలకు రిజర్వేషన్లు కల్పించాలి

- జారంగే జీవితంతో ఆడుకోవద్దు
- శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే

ముంబై : షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతుల ప్రయోజనాలను ప్రభావితం చేయకుండా మరాఠా, ధంగ్రా వర్గాలకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు తప్పక ఇవ్వాలని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ఆదివారం అన్నారు. మరాఠా సమాజంలోని ఒక వర్గం కోటా ప్రయోజనాల కోసం ఓబీసీలో చేర్చాలని డిమాండ్ చేస్తుండగా, ధంగ్రాలు ఎస్టీ హోదాను కోరుకుంటున్నారు. నిరాహార దీక్ష చేస్తున్న మరాఠా కోటా ఉద్యమకారుడు మనోజ్ జారంగే జీవితంతో ఆడుకునే బదులు, ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం ఆ సామాజిక వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలని, వారికి నష్టం జరగకుండా చూసుకోవాలని ఠాక్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జారంగే తమ సామాజిక వర్గానికి కోటా కోరుతూ జల్నాలో అక్టోబరు 25 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'మన్ కీ బాత్' మాట్లాడుతోందని, అయితే 'మన్'కు ఎలాంటి భావోద్వేగాలు లేవని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. జారంగే ప్రాణాలను కాపాడే ఉద్దేశం దానికి లేదు' అని ఠాక్రే ఆరోపించారు. మరాఠా సమాజానికి రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నాలపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన హామీపై సెప్టెంబరు 14న దీక్ష విరమించుకున్న జారంగే ఆగస్టు 29న మళ్లీ నిరాహార దీక్ష చేపట్టారు. అయితే, అటువంటి రిజర్వేషన్ ప్రయోజనాలను అందించడానికి జారంగే విధించిన అక్టోబరు 24 గడువు తర్వాత, ఆయన దసరా తర్వాత ఒక రోజు నిరాహార దీక్షకు కూర్చున్నాడు. రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌తో మరాఠా సమాజానికి చెందిన యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఠాక్రే తన ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆ సమాజం మృతదేహంపై ప్రభుత్వం రిజర్వేషన్ల ఉత్తర్వును ఉంచుతుందా' అని ఠాక్రే ప్రశ్నించారు. కొన్ని నెలలుగా రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌కు మద్దతుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మరాఠా సామాజిక వర్గం సభ్యులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు వార్తలు వచ్చాయి.

కోల్‌కతాలో రేషన్ షాపుల ఎదుట సీపీఎం నిరసనలు

కోల్‌కతా: రాష్ట్ర ప్రజాపంపిణీ వ్యవస్థలో అవినీతి కుంభకోణాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష సీపీఎం కోల్‌కతాలోని వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలు నిర్వహించింది. రాష్ట్రంలోని టీఎంసీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నగరంలోని జొరాసంకో, కాళీఘాట్ వంటి వివిధ ప్రాంతాల్లో ఆదివారం రేషన్ షాపుల ఎదుట సీపీఎం కార్యకర్తలు ప్లకార్డులు, పోస్టర్లు చేతబట్టి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ అవినీతి కుంభకోణానికి సంబంధించి మంత్రి జ్యోతి ప్రియా మల్లిక్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసిన సంగతి విదితమే. 2011 నుండి 2021 వరకు ఆహారం,సరఫరాల శాఖను నిర్వహించిన 66 ఏళ్ల మల్లిక్ ప్రస్తుతం రాష్ట్ర అటవీ శాఖ మంత్రిగా ఉన్నారు. కోట్లాది రూపాయల రేషన్ పంపిణీ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయనను శుక్రవారం తెల్లవారుజామున ఈడీ అరెస్టు చేసింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ... టీఎంసీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని... ఈ ప్రభుత్వ హయాంలో జరిగిన అనేక కుంభకోణాలకు రేషన్ కుంభకోణం ఒక ఉదాహరణ మాత్రమేనని తెలిపారు. అవినీతి కుంభకోణంలో నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం సహాయం అందించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ప్రతి ఒక్కరికీ సబ్సిడీ ఆహార ధాన్యాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చూడాలని పేర్కొంది.

కార్యాలయాల అద్దెలు తారస్థాయికి...

దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో అత్యధికం

న్యూఢిల్లీ : ఆసియా-పసిఫిక్ ప్రధాన కార్యాలయ మార్కెట్లలో దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతం ఆరవ అత్యంత ఖరీదైన మార్కెట్ అని నైట్ ఫ్రాంక్ పేర్కొంది. జులై-సెప్టెంబరు కాలంలో ప్రతి చదరపు అడుగుకు 78.4 డాలర్ల వార్షిక ఆక్యుపెన్సీ ఖర్చుతో ఇది ఉందని తెలిపింది. ఆక్యుపెన్సీ ఖర్చులో అద్దె, స్థానిక పన్నులు, ఇతర చార్జీలు ఉంటాయి. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ తన ఆసియా-పసిఫిక్ ప్రధాన కార్యాలయ అద్దె సూచీలో మూడో త్రైమాసికం (జులై-సెప్టెంబరు) 2023 కు విడుదల చేసింది. హాంగ్ కాంగ్ ఎస్‌ఏఆర్ త్రైమాసికంలో ఏపీఏసీకి చెందిన అత్యంత ఖరీదైన ఆఫీస్ మార్కెట్‌గా కొనసాగింది. దీని ఆక్యుపెన్సీ ఖర్చు సంవత్సరానికి చదరపు అడుగకు 164.7 డాలర్లుగా ఉంది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ముంబై తొమ్మిదవ అత్యంత ఖరీదైన వాణిజ్య మార్కెట్‌గా ఉంది. దీని వార్షిక ఆక్యుపెన్సీ ఖర్చు చదరపు అడుగుకు 70.5 డాలర్లు. బెంగళూరులోని ప్రధాన కార్యాలయం ఆక్యుపెన్సీ ఖర్చు సంవత్సరానికి చదరపు అడుగుకు 36.1 డాలర్లు, ఏపీఏసీ ప్రాంతంలోని 23 నగరాల్లో ఈ నగరం 19వ స్థానంలో ఉంది.

సిడ్నీ, టోక్యో, సియోల్ తర్వాత సింగపూర్ రెండవ అత్యంత ఖరీదైనది. బీజింగ్ ఏడవ స్థానంలో, హోచిమిన్ నగరం ఎనిమిదో స్థానంలో, షాంఘై 10వ స్థానంలో నిలిచాయి. 'ఈ త్రైమాసికంలో 7,00,000 చదరపు మీటర్ల లీజులు సీల్ చేయడంతో భారతదేశంలోని అతిపెద్ద అద్దెదారుల మార్కెట్లలో కార్యాలయ ప్రదేశం కోసం డిమాండ్ బలంగా ఉంది' అని నివేదిక పేర్కొంది. గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ) లను ఏర్పాటు చేసే అద్దెదారుల ద్వారా పెరిగిన కార్యకలాపాలు డిమాండ్‌లో మెజారిటీని కలిగి ఉన్నాయని పేర్కొంది. లావాదేవీల సామర్థ్యం పెరిగినప్పటికీ, భూస్వాములు ఆక్యుపెన్సీ స్థాయిలను పెంచడంపై దృష్టి సారించినందున అద్దె స్థాయిలు దాని మూడు అతిపెద్ద అద్దెదారుల మార్కెట్లలతో స్థిరంగా ఉన్నాయని నైట్ ఫ్రాంక్ వెల్లడించింది.

ఎంపీలో మరో ఇద్దరు బీజేపీ అభ్యర్థుల ఖరారు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని గుణ, విదిష అసెంబ్లీ స్థానాలకు భారతీయ జనతా పార్టీ ఆదివారం అభ్యర్థులను ప్రకటించింది. దీంతో నవంబర్ 17న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలోని మొత్తం 230 స్థానాలకు అధికార బీజేపీ అభ్యర్థులను ప్రకటించినట్లయింది. గుణ నుంచి పన్నాలాల్ షాక్యా, విదిశ అసెంబ్లీ స్థానాల నుంచి ముఖేష్ టాండన్‌లను బీజేపీ బరిలోకి దింపింది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం... ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు టాండన్ సన్నిహితుడు. షాక్యా 2013లో గుణ స్థానం నుంచి బీజేపీ టికెట్‌పై ఎన్నికయ్యారు. టాండన్ 2018 ఎన్నికల్లో విదిష నుంచి కాంగ్రెస్ అభ్యర్థి శశాంక్ భార్గవ చేతిలో ఓడిపోయారు. కాగా కాంగ్రెస్ పార్టీ విదిష స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే భార్గవను, పంకజ్ కనేరియాను బరిలో నిలిపింది. ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ 2013 అసెంబ్లీ ఎన్నికల్లో విదిష, బుద్నీ నుంచి పోటీ చేసి రెండు స్థానాల్లో విజయం సాధించారు. అయితే ఆయన బుద్నీ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగారు. నిలబెట్టుకోవడానికి చౌహాన్ విదిష స్థా రాజీనామా చేశారు. రాష్ట్రంలోని మొత్తం 230 అసెంబ్లీ స్థానాలకు అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లు తమ అభ్యర్థులను ప్రకటించాయి.

మహిళపై డెలివరీ ఏజెంట్ లైంగిక దాడి

పోలీస్ నుంచి గన్‌లాక్కొని పరార్

లక్నో: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై నిత్యావసర వస్తువులు డెలివరీ కోసం వచ్చిన ఏజెంట్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు నిందితుడి ఆచూకీ గుర్తించగా వారి నుంచి గన్ లాక్కొని పారిపోయాడు. ఈ నేపథ్యంలో సాయుధ పోలీస్ బలగాలను రప్పించి గాలింపు జరిపారు. చివరకు నిందితుడి కాలుపై కాల్పులు జరిపి అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఈ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మహిళ మొబైల్ యాప్ ద్వారా నిత్యావసరాలను ఆర్డర్ చేశారు. 23 ఏళ్ల సుమిత్ సింగ్ ఆ సరుకులను డెలివరీ చేయడానికి ఆమె నివాసానికి వెళ్లాడు. అయితే ఆ మహిళ ఒంటరిగా ఉన్నట్లు గ్రహించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. బాధిత మహిళ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. నిందితుడి ఆచూకీ గుర్తించి అతడు ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. అయితే సుమిత్ ఒక పోలీస్ నుంచి గన్ లాక్కొని అక్కడి నుంచి తప్పించుకున్నాడు. సాయుధ పోలీసులను చూసి నిందితుడు సుమిత్ సింగ్ వారిపై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతడి కాలుపై కాల్పులు జరిపారు. గాయపడిన నిందితుడిని అరెస్ట్ చేశారు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'ఇండియా' కూటమి పటిష్టతకు స్నేహ కలయిక

సీపీఐ నేత రామకృష్ణను కలిసిన సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): భారతదేశ అభ్యున్నతి కోసం 'ఇండియా కూటమి' 28 రాజకీయ పార్టీలతో స్నేహభావంతో ఏర్పడిందని, కూటమి పటిష్టత కోసం నేడు కాంగ్రెస్-సీపీఐ స్నేహపూర్వక కలయిక జరిగిందని కాంగ్రెస్ పార్టీ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. తనను ఆహ్వానించిన భారత కమ్యూనిస్టు పార్టీకి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రఘువీరారెడ్డిని అభినందిస్తూ ఆదివారం విజయవాడ దాసరి భవన్ వద్ద కార్యక్రమం నిర్వహించారు. రఘువీరారెడ్డి మాట్లాడుతూ చిరకాల మిత్రుడు అయిన రామకృష్ణ నిరంతరం అనంతపురం అభివృద్ధి కోసం పోరాడారని కొనియాడారు. విద్యార్థి దశలోనే రామకృష్ణ కృష్ణా జలాలను రాయలసీమకు తరలించాలంటూ గోడలపై నినాదాలు రాయటం తనను ఆకర్షించిందని తెలిపారు. విద్యార్థి ఉద్యమంలో భిన్న ధ్రువాలైన తమ ఇద్దరి మధ్య మంచి స్నేహభావం ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అహంకారంతో అడ్డగోలుగా పాలన సాగిస్తున్నాయన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు పాల్గొన్నాయని, ఎంతోమంది కాంగ్రెస్, కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అనేక నల్ల చట్టాలు తెచ్చారని, వ్యవసాయ చట్టాలు మాత్రమే వెనక్కు తీసుకున్నారని గుర్తు చేశారు. దేశం కోసం, ప్రజల రక్షణ కోసం, సంక్షేమం కోసం 'ఇండియా కూటమి' కృషి చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో మరింత సంఘటితంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రఘువీరారెడ్డి, తాను విద్యార్థి దశ నుంచే రాజకీయ ప్రత్యర్థులుగా ఉండే వారమని, నేడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మొట్టమొదటిసారిగా ఆయనను శాలువాతో అభినందించటం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశంలో విషాద పరిస్థితులు నెలకొన్న సందర్భంలో సీపీఐ, కాంగ్రెస్ రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కలిసికట్టుగా పని చేస్తాయన్నారు. ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును గత 50 రోజులుగా అక్రమంగా అరెస్టు చేసి జైల్లో నిర్బంధించటంలో నరేంద్ర మోదీ, అమిత్ షా, జగన్ పాత్ర ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతుంటే రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన వైసీపీ, టీడీపీ నోరెత్తలేకపోతున్నాయన్నారు. కనీసం చంద్రబాబు అరెస్టు కుట్ర వెనుక బీజేపీ ఉందనే మాటను కూడా తెలుగుదేశం నేతలు అనడానికి భయపడు తున్నారన్నారు. బీజేపీ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తూ ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలను అమలు చేయకుండా నిరాశ మిగిల్చిందన్నారు. రాజకీయ లబ్ధే బీజేపీ లక్ష్యమని, తెలంగాణా ఎన్నికల సందర్భంగా మరోమారు ఆంధ్ర ప్రదేశ్‌కు అన్యాయం చేసేందుకు సిద్ధమైందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ, జనసేన, వైసీపీ నరేంద్ర మోదీతో మాట్లాడేందుకు ముందుకు రాకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలిసి పని చేయడంలో సీపీఐ, కాంగ్రెస్ ముందుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ, కాంగ్రెస్ పార్టీ విజయవాడ నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, వినయ్ కుమార్, సీపీఐ, కాంగ్రెస్ నగర నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేశమంతటా చత్తీస్‌గఢ్ ప్రభుత్వ రైతు అనుకూల 'నమూనా'

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లోని తమ పార్టీ ప్రభుత్వ రైతు అనుకూల 'నమూనా' దేశమంతటా ప్రతిబిం బిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. ఆదివారం రాయ్‌పూర్ సమీపంలోని ఒక గ్రామంలో వరి పండించడంలో కొంతమంది రైతులకు ఆయన సహాయం చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ ఐదు పథకాలు, రుణమాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీతో సహా రైతుల ప్రయోజనాలకు ఉత్తమమైన పనులుగా రాహుల్ గాంధీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'రైతులు సంతోషంగా ఉంటే భారతదేశం సంతోషంగా ఉంటుంది' అని తరువాత సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆయన ఉదయం రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్ సమీపంలోని కఠియా గ్రామాన్ని సందర్శించారు. అక్కడ రైతులు, కూలీలతో సంభాషించారు. వరి కోయడంలో వారికి సహాయం చేశారని ఇక్కడ పార్టీ కార్యకర్త ఒకరు తెలిపారు. గాంధీ వెంట ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్, ఉప ముఖ్యమంత్రి టీఎస్ సింగ్ దేవ్ ఉన్నారు. వరి పొలంలో పని చేస్తున్న రైతులతో గాంధీ వారితో సంభాషిస్తున్న చిత్రాలను కాంగ్రెస్ విడుదల చేసింది. తన పర్యటన తర్వాత, గాంధీ తన 'ఎక్స్' ఖాతాలో అదే చిత్రాలను పోస్ట్ చేశారు. 'రైతులు సంతోషంగా ఉంటే భారతదేశం సంతోషంగా ఉంటుంది. చత్తీస్‌గఢ్‌లోని రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఐదు ఉత్తమ పనులు. ఇది భారతదేశంలోనే వారిని అత్యంత సంతోష పెట్టింది. వరిపై ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.2,640, 26 లక్షల మంది రైతులకు రూ.23 వేల కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ, 19 లక్షల మంది రైతులకు రూ.10 వేల కోట్ల రుణమాఫీ, విద్యుత్ బిల్లు సగం, 5 లక్షల మంది వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.7 వేలు, మేము భారతదేశం అంతటా ప్రతిబింబించే నమూనా' అని పేర్కొన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాలన్నీ భూపేశ్ బాఘెల్ ప్రభుత్వం ప్రారంభించింది. శనివారం నుంచి చత్తీస్‌గఢ్‌లో రెండు రోజుల పర్యటనకు వెళ్లిన గాంధీ, ఆదివారం రాజ్‌నంద్‌గావ్, కవార్ధా నియోజకవర్గాల్లో రెండు బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. 90 మంది సభ్యుల చత్తీస్‌గఢ్ అసెంబ్లీకి నవంబరు 7, 17 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

తగ్గని ధరలు: ఆగని ప్రజల కన్నీళ్లు

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే విమర్శించారు. తొమ్మిదిన్నరేళ్లుగా తగ్గని ధరలతో ప్రజల కన్నీళ్లు ఆగడంలేదని, మోదీకి ఇవేమీ పట్టడం లేదని వ్యాఖ్యానించారు. తాజాగా ఉల్లి ధరలు పెరిగిన క్రమంలో ఖడ్గే ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సమాధానం రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి ప్రజలే చెబుతారన్నారు. దేశ రాజధానిలో ఉల్లి సరఫరా కనిష్ఠస్థాయికి పడిపోవడం, కిలో రూ.65 నుంచి రూ.80 వరకు పలుకుతుండటంపై కేంద్రాన్ని ఖడ్గే దుయ్యబట్టారు. ద్రవ్యోల్బణం అంశం ఎప్పుడొచ్చినా మోదీ ప్రభుత్వం ప్రజలను అపహాస్యం చేస్తుందేతప్ప వారి కష్టాన్ని అర్థం చేసుకోదని ఎక్స్ మాధ్యమంగా విమర్శించారు. 'ద్రవ్యోల్బణం కనిపించదే', 'నేను ఉల్లి తినను', 'మిగతా దేశాలకంటే మెరుగ్గా ఉందిగా' వంటి వ్యాఖ్యలు మోదీ ప్రభుత్వం తరపున వినిపిస్తాయి. ఉల్లి ధర ఎందుకు ఇంతలా పెరిగింది? దీని రహస్యాన్ని బీజేపీని ఓడించడం ద్వారా ఐదు రాష్ట్రాల ప్రజలు బయట పెడతారు' అని ఖడ్గే అన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో దారుణం

అప్పు తీర్చేందుకు అమ్మకానికి కొడుకు

లక్నో: అప్పు తీర్చడం కోసం ఒక వ్యక్తి తన కొడుకును అమ్మకానికి పెట్టాడు. కుటుంబంతో కలిసి రోడ్డు పక్కన కూర్చొన్న ఆయన 'నా కుమారుడు అమ్మకానికి ఉన్నాడు. నేను అతడ్ని అమ్మాలనుకుంటున్నాను' అని రాసి ఉన్న బోర్డును మెడలో వేసుకున్నాడు. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో ఘటన జరిగింది. అలీగఢ్ బస్టాండ్‌కు సమీపంలో ఒక వ్యక్తి తన భార్య, కుమార్తె, కుమారుడితో కలిసి రోడ్డు పక్కన దీనంగా కూర్చొన్నాడు. అతడి మెడలో ఒక బోర్డు ఉంది. 'నా కొడుకు అమ్మకానికి ఉన్నాడు. కుమారుడ్ని నేను అమ్మాలనుకుంటున్నాను' అని రాసి ఉంది. ఆ వ్యక్తి తన బంధువు నుంచి రూ.50,000 అప్పుచేశాడు. అది తీర్చకపోవడంతో బంధువుతో గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో తన కుటుంబంతో కలిసి రోడ్డు పక్కన కూర్చొన్నాడు. తన కుమారుడ్ని బలవంతంగా అమ్ముకునేందుకు ప్రయత్నించాడు. అన్ని అప్పులు తీర్చేందుకు ఆరు నుంచి ఎనిమిది లక్షలకు కుమారుడ్ని అమ్మకానికి పెట్టినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఇది పోలీసుల దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆ బంధువుతో మాట్లాడి ఆ వ్యక్తి సమస్యను పరిష్కరించారు. సోషల్ మీడియాలో ఈ విషయాన్ని వెల్లడించారు. మరోవైపు యూపీలో ప్రధాన ప్రతిపక్షమైన ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సీఎం యోగి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అలీగఢ్‌కు చెందిన నిస్సహాయుడైన ఓ తండ్రి తన కొడుకును అమ్ముకుంటానంటూ మెడలో బోర్డు పెట్టుకుని రోధించాడు. ఇదే బీజేపీ అమృత కాలం. ఈ ఫొటో ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి రాష్ట్రంతో పాటు దేశ ప్రతిష్ఠను దిగజార్చకముందే ఎవరైనా ప్రభుత్వాన్ని మేల్కొల్పండి' అని ఎక్స్‌లో విమర్శించారు.

యువతపై మోదీది డ్రగ్స్ అస్త్రం: కన్హయ కుమార్

ముంబై: దేశ యువతను మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుస్తూ వారికి ఏమీ అర్థం కాకుండా కేంద్రప్రభుత్వం చేస్తోందని కాంగ్రెస్ నేత కన్హయ కుమార్ ఆరోపించారు. యువతపై డ్రగ్స్ అస్త్రాన్ని సర్కార్ ప్రయోగిస్తోందన్నారు. 'యువతను మత్తుకు బానిసలను చేస్తున్నారు. దాంతో తమ చుట్టూ ఏం జరుగుతుంది... తమకు, తమ వర్గానికి ఏం జరుగుతుందో గ్రహించలేని స్థితికి యువత చేరుతున్నారు. తమ భవిష్యత్, దేశ భవితవ్యం గురించీ ఆలోచించే శక్తిని కోల్పోతున్నారు' అని కన్హయ అన్నారు. దేశంలోని వేర్వేరు భాగాల్లో మాదకద్రవ్యాలు భారీగా పట్టుబడుతున్నాయి. ఇది ఎలా సాధ్యమన్నదే ఇప్పుడు యువతకు, దేశానికి పెద్ద సవాల్‌గా మారింది. భద్రతా వలయాన్ని ఛేదించి ఇంత భారీగా సరుకు ఎలా దేశంలోకి వస్తుందన్నది యువతకు, మొత్తం దేశానికి అర్థం కాని విషయం. గస్తీని దాటుకొని డ్రగ్స్ ఎలా దేశంలోకి ప్రవేశిస్తున్నాయన్నది ప్రధాన ప్రశ్నని ఆయనన్నారు. యువత కళ్లుగప్పేందుకు చాలా అస్త్రాలు ఉండగా మాదకద్రవ్యాల అస్త్రాన్ని కేంద్రం ప్రధానంగా వాడుతోందని విమర్శించారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్'లో డొల్లతనానికి ధారావీ పరిస్థితి నిదర్శనమని దుయ్యబట్టారు. వేలాది మంది ప్రజలను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? ధారావీలో పునరాభివృద్ధి నెపంతో అక్కడి వారి హక్కులను ఎందుకు నిరాకరిస్తున్నారు? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిరుద్యోగం జఠిలస్థితికి చేరిన వేళ యువత కోసం కొత్త యాప్‌లను ప్రధాని ఆవిష్కరిస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఏటా 2కోట్ల ఉద్యోగాలిస్తామన్నారు ఏమైంది? తొమ్మిదేళ్లలో 18 కోట్ల ఉద్యోగాలు ఏవి? భారత బడ్జెట్‌లో కనీసం పది శాతం కూడా విద్యపై ఖర్చు చేయలేదు. అంటే విద్యా ప్రైవేటీకరణను సర్కార్ కోరుకుంటోందనేగా అర్థం. దీంతో సామాన్యులకు విద్య అందని ద్రాక్ష అవుతుంది. పిల్లల స్కూలు ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు తదితరాలపై తమ సంపాదన మొత్తాన్ని సామాన్యులు ధార పోస్తారు. నిరుద్యోగం తీవ్రంగా ఉండటంతో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోంది. దేశంలో సగటున రోజుకు ఒక విద్యార్థి ఆత్మహత్య నమోద వుతోంది' అని కన్హయ కుమార్ వ్యాఖ్యానించారు. మన్ కీ బాత్ మాని జన్ కీ బాత్ (ప్రజల ఆశలు, ఆకాంక్షలు, డిమాండ్లు) పట్టించుకోవాలని మోదీకి హితవు పలికారు. మహారాష్ట్రలోని షిండే ప్రభుత్వం చేస్తున్నది రాష్ట్ర ప్రజలకు బాగా అర్థమవుతోందని, తగిన సమయంలో వారు సరైన సమాధానం ఇస్తారన్నారు. నేడు గుత్తాధిపత్యం అంతం కావాలి. అన్ని రంగాల్లో అందరికీ సమాన అవకాశాలు లభించాలి. అప్పుడు రాణించగలం' అని కన్హయ కుమార్ నొక్కిచెప్పారు. పార్టీ విద్యాశాఖ ఇంచార్జిగా ఆయన తొలిసారి రాష్ట్రంలో పర్యటించారు.

అగ్నిగోళంగా గాజా

- రెండవ దశకు ఇజ్రాయిల్ దురాక్రమణ
- 8వేల చేరువకు పలస్తీనా మృతులు
- నేడు ఐరాస భద్రతా మండలి భేటీ

జెరూసలేం: ఇజ్రాయిల్ దళాలు గగనతలం, భూతలంతో పాటు సముద్రం నుంచి భీకర దాడులు కొనసాగిస్తుండగా గాజా అగ్నిగోళంగా మారింది. పలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ దురాక్రమణ ఆదివారం 23వ రోజుకు చేరుకుంది. ఇప్పటివరకు 3,500 మంది పిల్లలు సహా 7,703 మంది పలస్తీనీయన్లు మృత్యువాత పడ్డారని హమాస్ ఆరోగ్యశాఖ తాజాగా ప్రకటించింది. గాజాలోని అతిపెద్ద ఆసుపత్రి సమీపంలో ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు వైమానిక దాడులు జరిపాయి. ఆ ఆసుపత్రిలో వేలాదిమంది ఆశ్రయం పొందుతున్నా గానీ ఆ ప్రాంగణం హమాస్ నియంత్రణలో ఉన్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్న నెపంతో దాడులకు ఇజ్రాయిల్ పాల్పడింది. గాజా స్ట్రిప్‌లో అర్ధరాత్రి జరిపే మెరుపుదాడులను పెంచింది. మరిన్ని దళాలు గాజాలోకి ప్రవేశించనున్నట్లు ఐడీఎఫ్ తెలిపింది. మూడు వారాలుగా గాజాను దిగ్బంధించి బాంబులతో విధ్వంసం సృష్టిస్తూ ఆత్మరక్షణ చర్యగా ఇజ్రాయిల్ చెప్పుకోవడాన్ని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. మానవతా సంక్షోభాన్ని పెంచవద్దని, గాజా ప్రజలకు మానవతా సాయాన్ని చేరనివ్వాలని కోరుతున్నాయి.

పరిస్థితి చేయి దాటుతోందని: ఐరాస హెచ్చరిక

తాజా పరిస్థితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయని, ఇజ్రాయిల్ వెంటనే భూతల దాడులను ఆపకపోతే పరిస్థితి చేయిదాటిపోతుందని ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. అదుపు చేయలేని స్థితికి మానవతా విపత్తు చేరుకుంటుందని హెచ్చరించారు. కళ్ల ఎదుట మానవతా విపత్తు సంభవిస్తోందన్నారు. అలాగే, ఇజ్రాయిల్ తీరు మారకుంటే అపార ప్రాణనష్టం జరుగుతుందని ఐక్యరాజ్య సమితి మానవహక్కుల కమిషనర్ వోల్కర్ టర్క్ హెచ్చరించారు. గాజాలో ఇంటర్నెట్, టెలి కమ్యూనికేషన్ వ్యవస్థను దెబ్బతీయడాన్ని ఖండిం చారు. ఎవరు ఏమన్నాగానీ ఇజ్రాయిల్ మాత్రం తన దురాక్రమణను ఆపడం లేదు. ఏకపక్షంగా ముందుకెళుతూ గాజాపై ముప్పేటదాడులు చేస్తోంది. పాశ్చాత్య దేశాల అండతో రెచ్చిపోతోంది. దీంతో ఈ సంక్షోభంపై చర్చించేందుకు సోమవారం ఐరాస భద్రతా మండలి సమావేశం కానుంది.

ఆహారం కోసం ఐరాస కేంద్రాల్లోకి చొరబడిన పలస్తీనీయన్లు

ఆకలిదప్పికలతో అల్లాడిపోతున్న గాజా ప్రజలు ఐక్యరాజ్య సమితి పలస్తీనా శరణార్థి సంస్థ (యూఎన్ఆర్‌డబ్ల్యూ) పంపిణీ కేంద్రాలు, భాండాగారాల్లోకి చొరబడ్డారు. నిల్వవున్న ఆహార పదార్థాలను వెంట తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన యూఎన్ఆర్‌డబ్ల్యూఏ 'ఇది తీవ్రమైన పరిస్థితి. సివిల్ ఆర్డర్ దెబ్బతింటోంది' అని వ్యాఖ్యానించింది. ప్రజలలో సహనం చచ్చిపోతోందని, పీడన పెరుగుతోందన్నారు. తాజా పరిణామం తీవ్రస్థాయి ప్రమాదఘంటికలు మోగిస్తోందని యూఎన్ ఆర్‌బ్ల్యూఏ గాజా డైరెక్టర్ థామస్ వైట్ అన్నారు.

కమ్యూనికేషన్ పునరుద్ధరణ

శుక్ర, శనివారం దాడుల్లో టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలు దెబ్బతినగా ఆదివారానికి అవి క్రమంగా అందుబాటులోకి వచ్చాయి. దీంతో తమ వారిని చేరుకునే ప్రయత్నాలను గాజా ప్రజలు చేస్తున్నారు. గాజాలో పనిచేస్తున్న అంతర్జాతీయ గుర్తింపుగల సహాయక సంస్థలకు స్పేస్ ఎక్స్ స్టార్‌లింగ్ శాటిలైట్ నెట్వర్క్ ద్వారా కమ్యూనికేషన్ సహకరాన్ని అంది స్తామని ఎలన్ మస్క్ ప్రతిపాదించగా ఇజ్రాయిల్ వ్యతిరేకించింది. ఆ సేవలను ఉగ్ర కార్యకలాపాల కోసం హమాస్ వినియోగించు కుంటుందని పేర్కొంది. రాబోయే రోజుల్లో గాజాలోకి సహాయ సామాగ్రిని ఎక్కువగా పంపేందుకు అనుమతి స్తామని ఇజ్రాయిల్ కల్నల్ ఇలడ్ గోరెన్ తెలిపారు.

అల్ ఖుద్దూస్‌పై ఐడీఎఫ్ గురి

గాజా స్ట్రిప్‌లోని అల్ ఖుద్దూస్ ఆసుపత్రిపై ఐడీఎఫ్ గురిపెట్టింది. దానిని వెంటనే ఖాళీ చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ఇజ్రాయిల్ అధికారుల నుంచి తమకు హెచ్చరికలు వచ్చాయని పలస్తీనియన్ రెడ్ క్రెసెంట్ వెల్లడించింది. ఆసుపత్రికి 50మీటర్ల దూరంలో ఆదివారం ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరిపినట్లు తెలిపింది. గాజా షిఫా ఆసుపత్రిలో 50వేల మంది పలస్తీనీయన్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే గాజా శిథిలం కాగా ప్రజలకు సరిపడ ఆహారం, తాగునీరు, ఇంధనం, మందులు లేవు. శిథిలాల కింద నుంచి శబ్దాలు వస్తున్నాయని, చిక్కుకున్న వారిని రక్షించేందుకు భారీ యంత్రాల అవసరం ఉందని, ఇందుకు సహకరించాలని అరబ్ రెస్క్యూ బృందాలను గాజా పౌర రక్షణ శాఖ కోరింది.

పాశ్చాత్య శక్తులే ప్రధాన కుట్రదారులు: టర్కీ

పలస్తీనియన్ల ఊచకోత వెనుక పాశ్చాత్యశక్తులే ప్రధాన కుట్రదారులని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ ఆరోపించారు. మత యుద్ధాన్ని కోరుకుంటున్నారా? అని పశ్చిమ దేశాలను నిలదీశారు. గాజా కమ్యూనికేషన్ వ్యవస్థ ధ్వంసం కావడం వల్ల 23 లక్షల మందికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అని ఎర్డోగన్ ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయ పోరాటానికి పిలుపునిచ్చారు. తొలుత ఆచితూచి మాట్లాడిన ఎర్డోగన్‌తిప్పుడు స్వరం మార్చి ఇజ్రాయిల్‌ను ఆక్షేపించారు. శనివారం అధికార పార్టీ అధ్వర్యంలో 15లక్షల మందితో నిర్వహించిన భారీ ర్యాలీలో ఎర్డోగన్ మాట్లాడుతూ 'గాజాలో మారణహోమం పాశ్చాత్యశక్తుల పని.. ఇజ్రాయిల్ యుద్ధ నేరాలకు పాల్పడుతోంది. ప్రతి దేశానికి ఆత్మరక్షణ హక్కు ఉంటుంది కానీ ఇజ్రాయిల్ చేస్తున్న దాంట్లో ఎక్కడా న్యాయం లేద'ని అన్నారు. ఉక్రెయిన్‌లో పౌరుల మరణంపై కన్నీళ్లుకార్చే పాశ్చాత్య శక్తులకు గాజాలో పలస్తీనా పౌరుల మరణాలు కనిపించడం లేదా అని నిలదీశారు. పశ్చిమ దేశాల ద్వంద్వ ప్రమాణాలు, ఈ కపటత్వాలన్నింటినీ తాము వ్యతిరేకమని తేల్చిచెప్పారు.

200 హెలికాప్టర్లతో ఇరాన్ యుద్ధ విన్యాసాలు

ఇరాన్ సైన్యం 200 హెలికాప్టర్లతో యుద్ధ విన్యాసాలు ప్రారంభించింది. ఇజ్రాయిల్, హమాస్ మధ్య భీకర పోరు వేళ సైనిక విన్యాసాలను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ చేపట్టడం సర్వత్రా చర్చకు దారితీసింది. తమ దేశానికి ఉన్న శత్రువులను హెచ్చరించడమే ఈ రెండు రోజుల సైనిక విన్యాసాల లక్ష్యమని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. గాజాపై యుద్ధ నేరాలు ఆపకపోతే ఇతర కూటములతో పోరాడాల్సిన స్థితి రావచ్చంటూ ఇజ్రాయిల్‌కు ఇరాన్ బహిరంగ హెచ్చరికలు చేసింది. అదే జరిగితే నివారించలేని తీవ్ర పరిణామాలను ఇజ్రాయిల్ ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

బందీలపై ఇజ్రాయిల్‌తో చర్చలకు సిద్ధం: హమాస్

బందీల విషయమై ఇజ్రాయిల్‌తో చర్చలు జరిపేందుకు తాము సిద్ధమని ఇస్లామిక్ రెసిస్టెన్స్ మూవ్‌మెంట్ (హమాస్) సాయుధ దళం అల్ ఖస్సాం బ్రిగేడ్స్ ప్రకటన చేసింది. 'ఒక్కసారిగా ఈ సమస్యను పరిష్కరించాలని ఇజ్రాయిల్ భావిస్తే అందుకు మేము సిద్ధం. కాదు దశలవారీగా జరగాలని కోరుకున్నా మాకు అభ్యంతరం లేదు' అని బ్రిగేడ్స్ సైన్యాధికారి అబు ఓబైదా తెలిపారు. బందీల అంశమై సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ ఇజ్రాయిల్ వైపు నుంచి పెద్దగా కసరత్తు ఏమీ జరగడంలేదన్నారు. ఇజ్రాయిల్ ముందుకొస్తే చర్చలకు తాము సానుకూలమని ఆయన చెప్పారు.

ఇది ఆరంభం మాత్రమే: ఇజ్రాయిల్ ప్రధాని

భూతల మెరుపు దాడులు కొనసాగిస్తూ మరింత భీకరపోరుకు ఇజ్రాయిల్ సిద్ధమైంది. హమాస్ సైన్యాన్ని అంతమొందించి బందీలందరికీ ఇంటికి చేర్చడమే లక్ష్యంగా తమ యుద్ధం రెండవ దశకు చేరుకున్నట్లు ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటన చేశారు. 'ఇది ఆరంభం మాత్రమే. శత్రువును భూమి మీదనే కాదు లోపల నుంచి కూడా నాశనం చేస్తాం' అని ఆయనన్నారు. తమ పోరాటం రెండవ దశకు చేరుకున్నట్లు తెలిపారు. ఇది సుదీర్ఘ పోరు... సిద్ధంగా ఉండండని తమ సైన్యానికి స్పష్టంచేశారు. భూతల దాడుల విస్తరణకు యుద్ధ కేబినెట్ ఏకగ్రీవంగా అంగీకరించిందన్నారు. 'మాతృభూమి రక్షణ కోసం పోరాడుతున్నాం. సముద్రం, భూమి, గగనతలం నుంచి దాడులు చేద్దాం. శత్రువును భూమిపైనే కాదు... భూమి లోపల అంతమొందిద్దాం. గెలవడమే లక్ష్యంగా మన పోరాటం సాగుతోంది' అని నెతన్యాహు ఉద్ఘాటించారు. హమాస్ స్థావరాలపై తమ దాడులు తీవ్రరూపం దాల్చనుండటంతో ఆయా ప్రాంతాలను వీడాలి గాజా పౌరులకు ఆదేశాలిచ్చారు.

సెమీస్‌లో టీమిండియా

ఇంగ్లండ్‌పై ఘన విజయం

లక్నో: వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. లీగ్ పోరులో విజయపరంపర కొనసాగిస్తున్న రోహిత్‌సేన... లక్నోలో ఆదివారం ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టీమిండియాకు ఇది వరుసగా ఆరో విజయం కావడం గమనార్హం. ఈ విజయంతో టీమిండియా ప్రపంచకప్‌లో సెమీస్ బెర్తు ఖాయం చేసుకోగా... ఈ ఓటమితో ఇంగ్లండ్ సెమీస్ అవకాశాలు మృగ్యమయ్యాయి. ఓ మోస్తరు స్కోరును కాపాడుకునే యత్నంలో టీమిండియా బౌలర్లు విజృంభించారు. 230 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ తడబాటుకు గురైంది. టీమిండియా బౌలర్లు చెలరేగడంతో 129 పరుగులకే చేతులెత్తేసింది. ఓ దశలో 52 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. టీమిండియా బౌలర్లు ఇంగ్లండ్ స్టార్ ఆటగాళ్లు జో రూట్ (0), బెన్ స్టోక్స్ (0) లకు కనీసం ఖాతా తెరిచే అవకాశం కూడా ఇవ్వలేదు. బెయిర్ స్టో 14, డేవిడ్ మలాన్ 16, కెప్టెన్ జోస్ బట్లర్ 10, మొయిన్ అలీ 15 పరుగులకు ఔట్ అవగా... ఆ తర్వాత లివింగ్ స్టోన్ 27, క్రిస్ వోక్స్ 10, అదిల్ రషీద్ 13 పరుగులు చేయగా, చివరి వికెట్‌గా మార్క్‌వుడ్ డకౌట్ అయ్యాడు. డేవిడ్ విల్లే 16 పరుగులతో అజేయగా నిలిచాడు. చివరకు ఇంగ్లండ్ 34.5 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో అత్యధికంగా షమీ 4, బుమ్రా 3, కుల్దీప్ 2, జడేజా ఒక వికెట్ చొప్పున పడగొట్టారు. మొదట బ్యాటింగ్ కు దిగిన టీమిండియా 50 ఓవర్లలో 9 వికెట్లకు 229 పరుగులు మాత్రమే చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (87), కేఎల్ రాహుల్ (39), సూర్యకుమార్ యాదవ్ (49) మినహా మిగతా బ్యాట్స్ మెన్ విఫలమయ్యారు. కోహ్లీ డకౌట్ కాగా, గిల్ 9, శ్రేయాస్ అయ్యర్ 4, జడేజా 8 పరుగులు చేశారు. ఓ పక్క వికెట్లు పడి పోతున్నప్పటికీ రోహిత్ శర్మ జట్టు గౌరవప్రదమైన స్కోరు సాధించేలా ఒంటిచేత్తో లాకొచ్చాడు. మొదటి నుంచి నుంచి బాల్‌ను బౌండరీ దాటిస్తూ వచ్చాడు. 101 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 87 పరుగులు చేశాడు. అయితే 37 ఓవర్లో ఆదిల్ రషీద్ వేసిన బంతిని భారీ షాట్ ఆడి లివింగ్‌స్టోన్ చేతికి చిక్కా డు. సెంచరీ చేస్తాడని అనుకుంటున్న సమయంలో 13 పరుగుల తేడాలో సెంచరీ మిస్ చేసుకుని అనూహ్యం గా పెవిలియన్ బాట పట్టాడు.

మరోవైపు ఇదే మ్యాచ్‌లో కేఎల్ రాహుల్, రోహిత్ శర్మ కలిసి సూపర్ ఇన్నింగ్స్ ఆడారు. నాలుగో వికెట్‌కు 91 పరుగుల అమూల్యమైన భాగస్వా మ్యా న్ని నెలకొల్పారు. 58 బంతుల్లో 3 ఫోర్లతో 39 పరుగులు సాధించిన కెఎల్ రాహుల్.. డేవిడ్ విల్లే బౌలింగ్లో జానీ బెయిర్‌స్టోకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యా డు. గత కొన్ని మ్యాచ్ ల్లో దారుణ ప్రదర్శన కనబర్చిన ఇంగ్లండ్ ఆదివారం టీమిండియాపై సాధికారికంగా బౌలింగ్ చేసింది. డేవిడ్ విల్లీ 3, క్రిస్ వోక్స్ 2, అదిల్ రషీద్ 2, మార్క్ ఉడ్ 1 వికెట్ తీశారు. పిచ్ పై బౌన్స్, కొద్దిగా స్వింగ్ లభించడంతో తమకు అనుకూలమైన పరిస్థితుల్లో ఇంగ్లండ్ బౌలర్లు విజృంభించారు. ధాటిగా ఆడేందుకు టీమిండియా బ్యాటర్లు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. అదే సమయంలో ఇంగ్లండ్ ఫీల్డింగ్ కూడా మెరుగ్గా ఉండడంతో టీమిండియాకు కష్టాలు తప్పలేదు.

రోహిత్ అరుదైన రికార్డు

ఈ మ్యాచ్‌లో టీమిండియా రోహిత్ శర్మ ఓ అరుదైన రికార్డును అందుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్లో 18 వేల పరుగుల మైలురాయిని చేరుకున్నా డు. మ్యాచ్ 21 ఓవర్లో ఓ ఫోర్ కొట్టి ఈ రికార్డును రోహిత్ తన ఖాతాలో వేసుకున్నాడు. అంతే కాకుండా ఇదే వేదికగా హిట్‌మ్యా న్ మరో ఘనతను కూడా సాధించాడు. టీమ్‌ఇండియా కెప్టెన్‌గా 100 మ్యాచ్‌లను పూర్తి చేసుకున్నా డు. అలా ఈ అరుదైన మైలురాయిని అందుకున్న ఏడో ఇండియన్ కెప్టెన్‌గా రోహిత్ రికార్డులకెక్కా డు. రోహిత్ కంటే ముందు ఈ జాబితాలో ఎంఎస్ ధోని, మహ్మద్ అజారుద్దీన్, విరాట్ కోహ్లీ, సౌరవ్ గంగూలీ, కపిల్ దేవ్, రాహుల్ ద్రావిడ్ ఉన్నారు. ఇప్పటివరకు అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి రోహిత్ శర్మ 99 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. 51 టీ20, 39 వన్డే, 9 టెస్టు మ్యాచ్‌లకు గాను రోహిత్ సారథ్య బాధ్యతలు చేపట్టాడు. 2017లో కెప్టెన్‌గా పగ్గాలు అంగదుకున్న హిట్‌మ్యాన్... తన నాయకత్వం లో ఏకంగా 73 మ్యాచ్‌లో జట్టును గెలిపించాడు. ఇక రోహిత్ కెప్టెన్సీలో టీమిఇండియా రెండు సార్లు ఆసియాకప్ కూడా గెలిచింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.